
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
5★★★
శుక్రవారం 24 జనవరి 2025



బాలికలకు ఆదరణేది..?



- అన్ని రంగాల్లో రాణిస్తున్నా ఆడపిల్ల అంటే చిన్నచూపే..
- చట్టాలు.. అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నా తొలగని వివక్ష
- జిల్లాలో గతేడాది 47 పోక్సో కేసులు నమోదు
- షీటీమ్ ద్వారా కౌన్సెలింగ్.. 44 కేసులు నమోదు
- జిల్లాలో వినూత్నంగా 'పోలీస్ అక్క' కార్యక్రమం
- అండగా నిలుస్తున్న ప్రభుత్వాలు, స్వచ్ఛంధ సంస్థలు
- 100 రోజుల పాటు అవగాహన కార్యక్రమాలకు ఏర్పాట్లు
- నేడు జాతీయ బాలికల దినోత్సవం

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

అన్ని రంగాల్లో మహిళలు దూసుకు పోతున్నా.. ఆడపిల్ల అంటే అందరికీ చిన్న చూపు తొలగని వివక్షగానే కొనసాగుతోంది. సనాతన సంప్రాదాయాలు, కట్టుబాట్ల మధ్య ఆడపిల్లను భారంగా భావిస్తున్న మనస్తత్వాలు బాలికల అభ్యున్నతికి నిరోధకంగానే మారాయి. కేంద్ర ప్రభుత్వం బేటీ బచావో, బేటీ పడావో.. కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. పదేండ్లుగా బాలికల కోసం వివిధ కార్యక్రమాలను చేపడుతోంది. మరోవైపు బాలికల శాతం తగ్గిపోతుండడంతో.. బాలికల గౌరవం పెంచడానికి, తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించడానికి కేంద్ర బాలిక శిశు సంక్షేమ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఒక థీమ్‌ను ప్రకటించి ఏటా జనవరి 24న జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. 2025 సంవత్సరానికి ఎంపవరింగ్ గర్ల్స్ ఫర్ ఏ బ్రైట్ ఫ్యూచర్ (ఉజ్వల భవిష్యత్తు కోసం బాలికలను శక్తివంతం చేద్దాం...)అనే థీమ్‌ను ప్రకటించారు. ఇందుకు అనుగుణంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా శుక్రవారం పలు కార్యక్రమాలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. గంభీరావు పేట మండలం నర్మాలలో వంద రోజుల కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. మహిళ లు, బాలికల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించడం మహిళలకు ఉన్న అవకాశాలు, చట్టాలపై అవగాహన కల్పించనున్నారు.

ఎందుకీ వివక్ష...

బిడ్డ జన్మ తల్లికి పునర్జన్మ.. తల్లి అనిపించుకోవడానికి ప్రాణాలను సైతం లెక్కచేయదు. మాతృత్వం ఒక మహత్తరమైన అనుభూతిగా భావిస్తారు. మనకు జన్మనిచ్చే అమ్మరూపమే ఆపదలో పడుతోంది. బాలిక లోకం అయోమయంలో చిక్కింది. మహిళలు పురుషులతో సమానమే అని చట్టాలు, పాలకులు చెబుతున్నా గర్భంలోనే ఆడపిల్ల అని తెలవగానే సాక్ష్యాలు లేకుండా హత్యలకు గురవుతున్నారు. కాగితాలకే చట్టం పరిమితమైపోయింది. ఒకప్పుడు ఆడపిల్ల అంటే తమ ఇంటి మహాలక్ష్మిగా భావించేవారు. ఇప్పుడు మగపిల్లాడే వంశోద్ధారకుడని భావించి, ఆడపిల్ల అక్కరలేదన్నట్లుగా భ్రమల్లో పడిపోయారు. బాలికల మనుగడలో భద్రత లేకుండా పోయింది. ప్రభుత్వం కల్పిస్తున్న చట్టాలు, పథకాలు, వారి దరిచేరడం లేదు. బాలికలు చదువుల్లో ముందు వరుసలో నిలుస్తున్నా ఉన్నత చదువులకు మాత్రం తక్కువ సంఖ్యలోనే వెళ్తున్నారు. రాజకీయంగా, వ్యాపారరంగాల్లో, ఉన్నత ఉద్యోగాల్లో మహిళలు రాణిస్తున్నారు. కానీ ఇంకా వంటింటికి పరిమితం చేయాలనే ఆలోచనలోంచి తల్లిదండ్రులు, తోడుగా ఉండే భర్త సైతం బయట పడడం లేదు. ముఖ్యంగా గ్రామాల్లో, గిరిజన తండాల్లో బాలికలు తీవ్ర వివక్షతకు గురవుతున్నారు.

జిల్లాలో గతేడాది 47 పోక్సో కేసులు

జిల్లాలో బాలికలు, మహిళలపై అనేక సంఘటనలు జరుగుతున్నాయి.చిన్నారులని చూడకుండా బాలికలపై అత్యాచారాలు, లైంగిక వేధింపులు, మిస్సింగ్‌లు తప్పడం లేదు. సైబర్ నేరాల్లో సైతం బాలికలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. జిల్లాలో బాలికలపై అఘాయిత్యాల సంఘటనల్లో 2024 డిసెంబరు వరకు 47 మందిపై పోక్సో కేసులు నమోదు చేశారు. 2023లో 38 కేసులు, 2022లో 60 కేసులు నమోదయ్యాయి. జిల్లాలో మహిళలు, బాలికలపై జరుగుతున్న నేరాలపై అడ్డుకట్ట వేసే విధంగా ఏర్పాటుచేసిన షీటీమ్ పోలీసులు బస్టాండ్‌లు, మహిళలు పనిచేసే ప్రాంతాల్లో పోకిరీలపై నిరంతరం నిఘా పెట్టారు. మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. 2023 సంవత్సరంలో 269అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆకస్మికంగా 542 ప్రాంతాలను విజిట్ చేసి, 24 కేసులు నమోదు చేశారు. 2024లో 415 అవగాహన కార్యక్రమాలు, 305 ఆకస్మిక విజిట్‌లు నిర్వహించి మిగతా 8లో

జిల్లాలో ఆరు సంవత్సరాల బాలబాలికల వివరాలు.. (2011 గణాంకాల ప్రకారం..)

మండలం	బాలురు	బాలికలు	మొత్తం
రుద్రంగి	905	885	1790
చందుర్తి	1489	1389	2678
వేములవాడ రూరల్	1364	1279	2643
బోయినపల్లి	1647	1509	3154
వేములవాడ	2376	2304	4680
సిరిసిల్ల	4599	4264	8863
కోనరావుపేట	1908	1691	3599
వీర్నపల్లి	740	697	1437
ఎల్లారెడ్డిపేట	1986	1891	3877
గంభీరావుపేట	2037	1980	4017
ముస్తాబాద్	1907	1758	3663
తంగళ్లపల్లి	2267	2157	4424
ఇల్లంతకుంట	1873	1848	3726
మొత్తం	25099	23652	48751

మహనీయుల జీవితాలు.. వ్యక్తిత్వ వికాస పాఠాలు

- కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా - కలెక్టరేట్‌లో నేతాజీ జయంతి వేడుకలు



సుభాష్‌చంద్రబోస్ జయంతి వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

సిరిసిల్ల కలెక్టరేట్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : మహనీయుల జీవితాల నుంచి అనేక వ్యక్తిత్వ వికాస పాఠాలను నేర్చుకోవచ్చని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో అదనపు కలెక్టర్ భీమ్యానాయక్‌తో కలిసి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పాల్గొని సుభాష్‌చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారని, అజాద్ హింద్ ఫౌజ్‌ను స్థాపించి పోరాడారన్నారు. మహనీయుల జయంతి వేడుకలు నిర్వహించడం ద్వారా వారి జీవితంలోని ముఖ్యంశాల నుంచి వ్యక్తిత్వవికాస పాఠాలు నేర్చుకోవచ్చన్నారు. డీపీఆర్వో వంగరి శ్రీధర్, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసచారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాధాబాయ్, మత్స్యశాఖ అధికారి నీరజ, జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్‌బేగం, కలెక్టరేట్ ఏవో రాంరెడ్డి పాల్గొన్నారు.

రేపు జాతీయ ఓటరు దినోత్సవం : కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఓటరు దినోత్సవాన్ని కలెక్టరేట్‌లో ఈనెల 25వ తేదీన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తెలిపారు. భారత ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఓటర్ నమోదు పెంపు, ఎథికల్ ఓటింగ్‌పై అవగాహన కల్పించేందుకు ఏటా జనవరి 25న ఓటర్ దినోత్సవంగా వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సంవత్సరం నథింగ్ లైక్ ఓటింగ్, ఐ ఓట్ ఫర్ ష్యూర్ అనే థీమ్‌తో వేడుకలు జరుగుతున్నాయన్నారు. జిల్లాలోని ప్రతి బూత్‌స్థాయి అధికారి పోలింగ్ స్టేషన్ పరిధిలో నూతన ఓటర్లకు ఓటర్ కార్డుల పంపిణీ, వృద్ధ ఓటర్లకు సన్మానం వంటి కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో 25న ఉదయం 11 గంటలకు జరిగే జిల్లాస్థాయి జాతీయ ఓటర్ దినోత్సవ కార్యక్రమానికి ప్రజలు హాజరుకావాలని కలెక్టర్ కోరారు.

నేడు కేటీఆర్ పర్యటన

సిరిసిల్ల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల జిల్లా కేంద్రంలో శుక్రవారం సాయంత్రం పలు కార్యక్రమాల్లో బీఆర్ఎస్ వర్కింగ్ అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ పాల్గొననున్నారు. పొదుపు సంఘాలకు సంబంధించిన భవనాన్ని ప్రారంభిస్తారు. సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమి పూజ చేసిన అనంతరం తెలంగాణ భవన్‌లో మున్సిపల్ పాలకవర్గం గడువు ముగిసిపోతున్న సందర్భంగా కౌన్సిలర్లను కేటీఆర్ సన్మానిస్తారు.

ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు

- జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వై. శ్రీనివాస్



మాట్లాడుతున్న జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శ్రీనివాస్

చందుర్తి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ప్రణాళికతో విద్యనభ్యసిస్తే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వై. శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చిలో జరిగే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. సమయాన్ని వృథా చేసుకోకుండా, చక్కని ప్రణాళికతో చదవాలని, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థి దశలో ఇంటర్మీడియట్ కీలకమైనదని పేర్కొన్నారు. ఉత్తమ విద్యార్థు లకు సమాజంలో మంచి గౌరవం దక్కుతుందన్నారు. పరీక్ష ఫీజు చెల్లించిన పాటందరు తప్పని సరిగా, కళాశాలకు హాజరు అయ్యేలా చూడాలని అధ్యాపకులకు సూచించారు. కళాశాలలో 90 రోజుల ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కాస దేవరాజం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్య సంరక్షణపై దృష్టి పెట్టాలి : డీఎంహెచ్‌వో



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ నయూమా

సిరిసిల్ల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు, పిల్లల ఆరోగ్య సంరక్షణపై దృష్టి పెట్టాలని పోషకాహారాన్ని అందించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్ రజిత అన్నారు. గురువారం సిరిసిల్లలో జిల్లా ఐఎంఏ భవనంలో పాఠశాల పిల్లల ఆరోగ్యం, సంరక్షణ అంశంపై మండల రిసోర్స్ పర్సన్‌లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నయూమా పిల్లల మానసిక ఆరోగ్యం, సమతుల్య ఆహారంపై అవగాహన కల్పించారు. డాక్టర్ పావని పిల్లల ఆరోగ్యం, పెరుగుదల, హెచ్ఐవీ, ఎయిడ్స్, ఆడపిల్లల గర్భసంచి సంక్రమణ వ్యాధులపై అవగాహన కల్పించారు. పిల్లల ప్రవర్తన, ఆడపిల్లల, బాలురతో సమాన అవకాశాల గురించి శిల్ప అవగాహన కల్పించారు. ఉపాధ్యాయుడు యాద రవి ఇంటర్‌నెట్, మొబైల్ ఫోన్‌ల లాభాలు, ప్రభావాలు, పిల్లల ప్రవర్తనపై వివరించారు. ఉపాధ్యాయుడు తిరుపతిరెడ్డి పిల్లలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో ఉండే ప్రవర్తనపై వివరించారు. ఉపాధ్యాయుడు వెంకటరమణ, పిల్లల చదువులు, వాటి విలువలు సాధించే లక్ష్యాలను వివరించారు.

స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

సిరిసిల్ల టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహించే స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు ఉంటాయని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్ రజిత అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో పీసీపీఎన్‌డీటీ అడ్వైజరీ కమిటీ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత మాట్లాడారు. జిల్లాలోని స్కానింగ్ సెంటర్లు నిబంధనలకు లోబడి నిర్వహించాలన్నారు. స్కానింగ్ సెంటర్లలో రేడియాలజిస్టులతో మాత్రమే స్కానింగ్ చేయాలని సూచించారు. అనంతరం జిల్లాలోని స్కానింగ్ సెంటర్లలో ఫామ్ ఎఫ్ ఆడిట్లను, స్కానింగ్ సెంటర్ల వివరాలను కమిటీ సభ్యులు సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీనారాయణ, పీఓఎంఎస్ఎన్ డాక్టర్ అంజలి ఆల్ఫ్రెడ్, డీజీవో శోభరాణి, హెచ్ఈ బాలయ్య, ఎన్జీవో చింతోజు భాస్కర్, లీగల్ అడ్వైజర్ శాంతిప్రకాష్‌శుక్లా, తమటం రామానుజమ్మ, ఝాన్సీ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భరతమాత ముద్దుబిడ్డ నేతాజీ..

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



నేతాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : నేతాజీ సుభాష్ చంద్రబోస్ భరతమాత ముద్దుబిడ్డ అని వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, అజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని గురువారం వేములవాడలో ఘనంగా నిర్వహించారు. స్థానిక సుభాష్‌నగర్‌లోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి ఆయన పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ బ్రిటీష్ వారిని గడగడలాడించిన భరతమాత ముద్దుబిడ్డ నేతాజీ అంటూ కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, మున్సిపల్ కౌన్సిలర్ ఇప్పపూల అజయ్, నాయకులు సాగరం వెంకటస్వామి, గూడూరి మధు, కూరగాయల కొమురయ్య, కొక్కుల బాలకృష్ణ, తోట రాజు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ తదితరులు నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్, జిల్లా కార్యదర్శి రేగుల మల్లికార్జున్, సీనియర్ నాయకులు సంటి అంజిబాబు, సంటి మహేష్, కృష్ణ స్వామి, రేగుల రాజు, నామాల శేఖర్, బిల్ల కృష్ణ, బోనాల శివలు పాల్గొన్నారు.

వాహనదారులు రోడ్డు భద్రత నియమాలను పాటించాలి

- కుటుంబ సభ్యులు ఎదురుచూస్తారని డ్రైవర్లు మర్చిపోవద్దు.. - సడక్ సురక్ష అభియాన్‌లో ప్రభుత్వ విప్ ఆది



ఆటోలకు స్టిక్కర్లను అతికిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి

వేములవాడ టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలను పాటించాలని, డ్రైవింగ్ చేసే సమయంలో ఇంటివద్ద కుటుంబ సభ్యులు తమ కోసం ఎదురుచూస్తారని గుర్తుంచుకుని ముందుకు సాగాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ ఆర్టీసీ బస్టాండు సమీపంలో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ రహదారి భద్రత మహోత్సవంలో భాగంగా సడక్ సురక్ష అభియాన్ జాగ్రత్త కార్యక్రమానికి ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తిప్పాపూర్ బస్టాండు నుంచి రాజన్న ఆలయం వరకు స్వయంగా ఆటో నడిపారు. కార్మికు లతో కలిసి కోరుట్ల బస్టాప్ వద్ద మానవహారంగా ఏర్పడి రోడ్డు భద్రత ప్రమాణం చేయించి అవగహన కల్పించారు. అనంతరం ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు భద్రత నియమాలను తప్పకుండా పాటించాలని అన్నారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేసి తమ విలువైన ప్రాణాలను తీసుకోవద్దన్నారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని కొనియాడారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని గంజాయి రహిత రాష్ట్రంగా మార్చేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఇండ్లు లేని ఆటో కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తామని హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, టౌన్ సీఐ వీరప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, ఆటో యూనియన్ అధ్యక్షుడు సంద్రగిరి శ్రీనివాస్ డీటీవో లక్ష్మణ్, ఎంవీఐ వంశీధర్, ట్రాఫిక్ ఎస్సై రాజు, డిపో మేనేజర్ తదితరులు ఉన్నారు.



ఎల్లారెడ్డిపేటలో ప్రజాపాలన దరఖాస్తు రశీదులను చూపుతున్న ప్రజలు

ఎల్లారెడ్డిపేట గ్రామసభలో అధికారుల నిలదీత 8



పాఠశాల గోడపై వేసిన చిత్రం

చుక్‌చుక్ రైలు బ(ం)డి.. - దాతల సహకారంతో పాఠశాలకు రంగులు 7

అర్హులకు పథకాలు అందడం లేదు..

- నర్మాల గ్రామ సభలో అధికారుల నిలదీత



నర్మాల గ్రామసభలో అధికారులను నిలదీస్తున్న ప్రజలు

గంభీరావుపేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలం నర్మాల ప్రజా పాలన గ్రామసభ గందరగోళంగా మారింది. అర్హులకు పథకాలు అందడం లేదని ప్రజలు ఆరోపించారు. జాబితాలో వచ్చిన అనర్హుల పేర్లను తొలగించాలని పట్టుబట్టారు. ఇప్పుడున్న ఇందిరమ్మ కమిటీని రద్దు చేసి, ప్రజల సమక్షంలో తిరిగి ఎన్నుకోవాలని డిమాండ్ చేశారు.

అధికారులను నిలదీసిన కాంగ్రెస్ నేత

పథకాల అమలులో అధికారుల తప్పిదాల వల్ల తమ ప్రభుత్వం బద్నాం అవుతోందంటూ నర్మాల గ్రామసభలో జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి నిమ్మల తిరుపతిగౌడ్ అధికారులను నిలదీశారు. గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్ రూంల పంపిణీలో అనర్హులకే ఎక్కువ కేటాయించారని తిరుపతిగౌడ్, మరికొందరు గ్రామసభ దృష్టికి తెచ్చారు. డబుల్ బెడ్ రూంల పంపిణీలో రీసర్వే చేసి, అర్హులకు కేటాయించాలని తిరుపతిగౌడ్ డిమాండ్ చేశారు. అప్పటి వరకు గ్రామసభ నిర్వహించరాదని పట్టుబట్టారు. ఇదిలా ఉండగా కాంగ్రెస్ నాయకులకు తెలిసే అధికారులు జాబితా సిద్ధం చేశారని బీఆర్ఎస్ పార్టీ నేతలు వాదించారు. దీంతో మరికొందరు కాంగ్రెస్ నేతలు కలుగ జేసుకుని గత 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో మీకు నచ్చిన వారికే ఎలా ఇచ్చారో మేమూ కూడ అలానే ఇస్తాం అంటూ బీఆర్ఎస్ నేతలతో అనడంతో ఇరు పార్టీల మధ్య కొద్దిసేపు వాదోపవాదాలు జరిగాయి. అనర్హులను గుర్తించి, వారిని తొలగిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో శాంతించారు. ఇరిగేషన్ డీఈ, ప్రత్యేక అధికారి నర్సింగ్, తాహసీల్దార్ భూపతి, కార్యదర్శి రూతు తదితరులు ఉన్నారు.

అర్హులను మాత్రమే పరిచారకులుగా నియమించాలి



ఈవో వినోద్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ప్రతాప రామకృష్ణ

వేములవాడ కల్చరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో జరుగుతున్న వివిధ సేవలు, పూజలు కోసం కొత్తగా తీసుకునే పరిచారక పోస్టులకు ఘర్‌పట్టి కలిగిన హక్కుదారులకు మాత్రమే నియమించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ ఈవో వినోద్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు గురువారం ఆయన ఈవోను కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ ఇక్కడి వారు మాత్రమే అనుభవం, ఆచారపద్ధతులను తెలుసుకుని ఉన్నారని, రాజన్న ఆలయంలో పూజా విధానాలు అన్నీ జగద్గురు శృంగేరి స్వామి సూచనల మేరకు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పుడు మంజూరైన పరిచారక పోస్టుల విషయంలో ఘర్‌పట్టి, అగ్రహార వ్యవస్థ కలిగివున్న వారిని నియమించాలని, 2012లో ఇచ్చిన నోటిఫికేషన్ పద్ధతిలో అర్హులైన అర్చక పరీక్షల్లో ఉత్తీర్ణులైన అనుభవం కలిగిన అనువంశీక ఘర్‌పట్టీ కలిగిన కుటుంబాలకు నియమించాలని ఈవోను కోరారు.

సరదాగా కొబ్బరి చెట్టు ఎక్కిన ఎస్పీ..

సిరిసిల్ల క్రైం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని విద్యానగర్‌లో గల ఎస్పీ క్యాంపు కార్యాలయం ఆవరణలో ఉన్న కొబ్బరి చెట్టుపైకి ఎస్పీ అఖిల్ మహజన్ ఎక్కారు. గురువారం రాత్రి కార్యాలయం ఆవరణలో ఉన్న కొబ్బరి చెట్టుపై ఉన్న కాయలను తెంపేందుకు గీతకార్మికులు వచ్చారు. గీత కార్మికుల మోకు సహాయంతో ఎస్పీ సరదాగా కొబ్బరిచెట్టు ఎక్కాలని ప్రయత్నించారు. మొకును నడుంకు వేసుకొని మెల్లమెల్లగా 20మీటర్ల ఎత్తు ఉన్న కొబ్బరి చెట్టును ఎక్కారు. ఎస్పీ కొబ్బరి చెట్టు ఎక్కే వీడియో సోషల్‌మీడియాలో వైరల్ అయింది.

కుక్కల దాడిలో వ్యక్తికి గాయాలు

రాయికల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దావన్‌పెల్లి గ్రామంలో ఊర కుక్కలు బీభత్సం సృష్టించాయి. గ్రామానికి చెందిన భూక్య తిరుపతిపై కుక్కలు దాడి చేయగా తీవ్ర గాయాలయ్యాయి. దీంతో తిరుపతిని వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. గ్రామాల్లో కుక్కల బెడద అధికంగా ఉందని, అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

బైండోవర్ ఉల్లంఘించిన వ్యక్తికి జైలు శిక్ష

రాయికల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పుమడుగు గ్రామానికి చెందిన అల్లెపు వెంకటనర్సయ్య బైండోవర్ ఉల్లంఘించడంతో జైలు శిక్ష పడింది. వెంకటనర్సయ్య గతంలో ఎక్సైజ్ నేరంలో పట్టుబడగా బైండోవర్ చేశారు. బైండోవర్‌ను ఉల్లంఘించి మళ్లీ నాటుసారా విక్రయిస్తూ పట్టుబడగా లక్ష రూపాయల జరిమానా విధించారు. సకాలంలో జరిమానా చెల్లించలేకపోవడంతో జగిత్యాల ఎక్సైజ్ సీఐ సర్వేశ్వర్‌రావు గురువారం రాయికల్ తహసీల్దార్ ఖయ్యూం ఎదుట హాజరుపరుచగా అతనికి 161 రోజుల జైలు శిక్షను విధించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ మాట్లాడుతూ నాటుసారా ఎవరైనా తయారు చేసినా, విక్రయించినా, రవాణా చేసినా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీటీఎఫ్ సీఐ రాజమౌళి, ఎస్సైలు స్వప్న, సుధీర్‌రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఒకరి బైండోవర్

చందుర్తి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ఒకరిపై దాడికి యత్నించడమే కాకుండా, ఇంటికి వెళ్లి అసభ్యకరంగా దూషించిన ఓ వ్యక్తిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై అంజయ్య గురువారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన రవి అనే వ్యక్తి వారం రోజుల క్రితం పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమంలో భాగంగా జగన్ అనే వ్యక్తిపై దాడికి ప్రయత్నించడమే కాకుండా జగన్ ఇంటికి వెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు రవిని తహసీల్దార్ శ్రీనివాస్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

బోయినపల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లి మండలం వర్ధవెల్లి గ్రామశివారులో వరద కాలువలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ పృథ్వీధర్‌గౌడ్ తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 40 సంవత్సరాలు ఉంటుందని, మృతుడు ఒంటిపై తెల్లచొక్కా ధరించినట్లు ఎస్ఐ తెలిపారు.

చైన్‌స్నాచర్ల అరెస్ట్

అంతర్గాం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ముర్మూర్‌లో కిరాణా షాపు నడుపుతున్న పెసరి సత్తమ్మ అనే మహిళా మెడలో గొలుసు చోరీ చేసిన ఇద్దరు నిందితులను గురువారం ఎస్ఐ వెంకటస్వామి పట్టుకున్నారు. ఈ నెల 22న మందమర్రికి చెందిన నామని రమేష్, రామకృష్ణపూర్‌కు చెందిన మాదం శ్రీనివాస్ అనే ఇద్దరు నిందితులు పెట్రోల్ కావాలంటూ సత్తమ్మ కిరాణషాప్‌నకు వెళ్ళారు. సదరు మహిళ వెనుకకు తిరిగే లోపు మెడలోని గొలుసు లాక్కొని పరారయ్యారు. మహిళా ఫిర్యాదు మేరకు పోలీసులు గురువారం ఉదయం నిందితులను పట్టుకొని మూడు తులాల బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితులను గోదావరిఖని కోర్టులో హాజరు పర్చగా రిమాండ్ విధించారు. పోలీసులు రవీందర్, రాజేందర్, నాగరాజు పాల్గొన్నారు.

నేటికీ కొనసాగుతున్న భ్రూణ హత్యలు

ఆడపిల్లలకు తప్పని వేధింపులు

నేడు జాతీయ బాలికా దినోత్సవం

అడుగడుగునా వివక్ష





అయ్యో.. ఆడపిల్లేనా..
ఆడపిల్లలకు చదువెందుకు..
ఏంటా బట్టలు.. ఆడపిల్లలు ఇలాంటివి వేసుకోవచ్చా..
ఇవీ ఇళ్లలో, బయటా తరుచూ వినిపించే మాటలు..
ఎంత ఆధునిక సమాజంలో ఉన్నా.. బాలికలు, యువతులు, మహిళలు అన్ని రంగాల్లో సత్తాచాటుతున్నా.. ఎంతో ఉన్నత స్థానాలకు ఎదిగినా.. వివక్ష మాత్రం కొనసాగుతూనే ఉంది. వివక్షను రూపుమాపేందుకు, ఆడపిల్లలకు హక్కులు, విద్య, ఆరోగ్యం భద్రతపై అవగాహన కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ బాలికా దినోత్సవం నిర్వహిస్తోంది. 'ఉజ్వల భవిష్యత్ కోసం బాలికలకు సాధికారత' అనేది ఈ యేడు థీమ్..

నేపథ్యం

ఆడపిల్లల హక్కులు, విద్య, ఆరోగ్యం భద్రతపై అవగాహన కల్పించేందుకు, వారి సాధికారతకు జాతీయ స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రతి సంవత్సరం జనవరి 24న జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహిస్తుంది. 2008లో కేంద్ర ప్రభుత్వం జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించడం ప్రారంభించింది. ఇందులో భాగంగా లింగ వివక్ష, గృహ హింస వంటి సమస్యలపై అవగాహన కల్పిస్తారు. ఈ సంవత్సరం 'ఉజ్వల భవిష్యత్తు కోసం బాలికలకు సాధికారత' అనే థీమ్‌తో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహిస్తున్నారు.

గణేశ్‌నగర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మన దేశంలో గర్భస్థ శిశువు నుంచే భ్రూణ హత్యల రూపంలో బాలికలకు కష్టాలు ప్రారంభమవుతున్నాయి. ఆడపిల్ల అని తెలియగానే పిండ దశలోనే వారిని చిదిమేస్తున్నారు. ఆడపిల్ల ఎదిగే క్రమంలో సామాజిక కట్టుబాట్ల రూపంలో ఇంటా..బయటా నిర్బంధాలను ఎదుర్కొంటున్నారు. బాలికలకు పోషకాహారం, విద్య, వైద్య, న్యాయం, సంరక్షణ లాంటి కనీస హక్కులు అందడం లేదు. బాల్య వివాహాలు ఇంకా కొనసాగుతున్నాయి. వీటన్నింటిని రూపుమాపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి.

అడుగడుగునా సమస్యలు

సమాజం ఎంత ఆధునికంగా మారినా కొన్ని వివక్షలు తొలగిపోవడం లేదు. ఆడపిల్లలు పుట్టగానే అయ్యో.. ఆడపిల్లేనా.. అంటూ సానుభూతి చూపించడం సాధారణమైపోయింది. నేడు మహిళలు, యువతులు ఎన్నో రంగాల్లో సత్తా చాటుతున్నా ఈ వివక్ష కొనసాగుతూనే ఉంది. ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో బాలికలు చదువుకు నోచుకోవడం లేదు. అతికష్టం మీద ప్రాథమిక విద్య వరకు చదువుకుని పని వెళుతున్న బాలికలు ఎంతోమంది ఉన్నారు. ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకున్నా ప్రజల్లో మార్పులు తీసుకురాలేకపోతున్నాయి. పాఠశాలలకు ఎన్ని నిధులు వెచ్చించినా కనీసం మరుగుదొడ్లను ఏర్పాటు చేయలేకపోతున్నారు. చదువుకునేందుకు వెళ్లిన బాలికలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు వేధింపులతో సతమతమవుతున్నారు. ఈ ఇబ్బందులు ఎదుర్కొంటూ చదువుకులేక పోతున్నారు. తల్లిదండ్రులు బాలికలను చదువు మానిపించి వివాహాలు చేస్తున్నారు. గతంతో పోలిస్తే కొంత మార్పు వచ్చినా ఇప్పటికీ బాల్య వివాహాలు జరుగుతూనే ఉన్నాయి. కరీంనగర్ జిల్లాలో ప్రతి వెయ్యి మంది పురుషులకు 981 మంది స్త్రీలు ఉన్నారు.

బాలికల కోసం పలు పథకాలు

బాలికల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయి. వాటిపై అవగాహన లేకపోవడంతో వీటిని వినియోగించుకోలేకపోతున్నారు. బేటీ బచావో బేటీ పడావో, సుకన్య సమృద్ధి యోజన, లాడ్లీ స్కీమ్ లాంటి పథకాలు ఉన్నాయి. అధికారులు ఈ పథకాలపై అవగాహన కల్పించకపోవడంతో నామమాత్రంగా అమలవుతున్నాయి.

సమాన అవకాలు కల్పించాలి

అద్వైత, విద్యార్థిని



విద్య, ఆరోగ్యం, భద్రతలో బాలికలకు సమాన అవకాశాలు కల్పించాలి. వ్యక్తులు, సంఘాలు, ప్రభుత్వం సమష్టిగా కృషి చేస్తేనే బాలికల అభివృద్ధి సాధ్యమవుతుంది. బాలికలపై వివక్ష చూపించే వారు ఇకనైనా తమ పద్ధతి మార్చుకోవాలి.

బాలికలను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలి

మైలారపు భవిత, విద్యార్థిని



బాలికలపై వివక్ష కొనసాగుతోంది. గ్రామీణ ప్రాంతాలలో ఆడపిల్ల చదువు అంతంత మాత్రంగానే ఉంది. ప్రాథమిక పాఠశాలల్లో బాలికలు బాలురితో సమానంగా ఉన్నా.. ఉన్నత విద్యకు చేరుకునేసరికి 30 శాతం మంది మాత్రమే మిగులుతున్నారు. కుటుంబ అవసరాలు, ఆర్థిక ఇబ్బందులతో వారిని చదువులకు దూరం చేస్తున్నారు. బాలికలను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలి.

అట్రాసిటి కేసులో రూ. మూడు లక్షల లంచం

- మళ్లీ కేసు ఫైల్ చేశాడని సీఐపై మధ్యవర్తి ఆరోపణ
- విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్

జమ్మికుంట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణ సీఐ వరంగంటి రవికుమార్‌పై సామాజిక కార్యకర్త షేక్ సాబీర్ అలీ సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఆడియో గురువారం వైరల్ అయ్యింది. తాను లంచం ఇచ్చినా కేసు ఎలా పెట్టారంటూ షేక్ సాబీర్ సీఐని ఏకవచనంతో సంభోదించడం తీవ్ర దుమారం లేపింది. ఆడియో వైరల్ కావడంతో షేక్ సాబీర్ అలీ విషయాన్ని వివరిస్తూ ఓ వీడియో విడుదల చేశాడు. మండలంలోని కోరపల్లిలోని డైయిరీ యాజమాని మారుతిరావు, కృష్ణారావు, గోవిందారెడ్డి, మధుకు సంబంధించిన వివాదంలో అట్రాసిటీ కేసు విషయమై షేక్ సాబీర్ అలీని కృష్ణారావు సంప్రదించాడు. దీంతో సాబీర్ అలీ పట్టణ సీఐ రవికుమార్‌ను కలిసి కేసు కొంచెం చూడాలని అడిగాడు. ఫిర్యాదు దారుడు పట్టుదలతో ఉన్నాడని, పై అధికారుల నుంచి ఒత్తిడి ఉందని సీఐ తెలిపారు. వారు కోర్టులో పరిష్కరించుకుంటారని, అందుకు అవకాశం ఇవ్వాలని కోరగా, మూడు లక్షలు ఇవ్వాలని సీఐ అడిగారన్నాడు. దీంతో సీఐ చాంబర్‌కు మూడు లక్షలు తీసుకువెళ్లామని, ఆయన సూచన మేరకు చాంబార్‌లోని బాత్రూమ్‌లోని బకెట్లో డబ్బులు పెట్టినట్లు తెలిపాడు. అయినా సీఐ అట్రాసిటీ కేసు నమోదు చేశారన్నాడు. తాను ఫోన్ చేసి ఇదేమిటని నిలదీశానని, ఆయన వెంటనే ఇద్దరు వ్యక్తులను తన వద్దకు పంపించి సెల్‌ఫోన్ లాక్కున్నారని తెలిపాడు. అప్పటికే తాను ఆడియో రికార్డును తన సన్నిహితులకు పంపించానని, అదే ఆడియో ఈరోజు సాక్ష్యంగా నిలిచిందన్నాడు. ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరాడు.

● షేక్ సాబీర్ అలీ బ్లాక్ మెయిలర్

షేక్ సాబీర్ అలీ అనే వ్యక్తి ఒక బ్లాక్ మెయిలర్ అని సీఐ వరంగటి రవికుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో అతడిపై పలు కేసులు ఉన్నాయన్నారు. సామాజిక కార్యకర్త, హెచ్‌ఆర్సీలో పనిచేస్తున్నానంటూ ప్రచారం చేసుకుంటూ తిరుగుతుంటాడని తెలిపారు. పలువురిని బెదిరింపులకు గురిచేస్తూ, పంచాయతీలు నిర్వహిస్తూ జీవనం సాగిస్తాడన్నారు. ఇలాంటి వ్యక్తులను ప్రజలు వ్యతిరేకించాలని కోరారు.

● ఉన్నతాధికారుల విచారణ

కరీంనగర్ క్రైం: జమ్మికుంట పట్టణ సీఐతో జరిపిన ఫోన్ కాల్ ఆడియో సంభాషణను అదేప్రాంతానికి చెందిన సాబీర్ అనే వ్యక్తి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశాడు. ఈ ఘటనపై సీపీ విచారణకు ఆదేశించినట్లు తెలిసింది. ఎస్సీ, ఎస్టీ కేసులో ఏసీపీ స్థాయి అధికారి విచారణ జరుపుతారు. అలాంటిది సీఐ ఎలా డబ్బులు తీసుకుంటారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆరోపణలు చేస్తున్న వ్యక్తిపై గతంలో మూడుకేసులు నమోదైనట్లు జమ్మికుంట పోలీసుల పేరిట ఒక లేఖ విడుదల అయింది. నెలరోజుల క్రితం లంచం డబ్బులు ఇచ్చానని చెబు తుండగా ఆరోజున సీసీ కెమెరాల పుటేజీలను విచారణ అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన ఆడియో నవంబరు నెలలో రికార్డు అయ్యిందని విచారణ అధికారులు గుర్తించారు. అక్టోబరు 13న ఫిర్యాదు రాగా అప్పుడే కేసు నమోదయ్యింది. నవంబరులో సాబీర్ అనే వ్యక్తి సదరు సీఐకి ఫోన్ చేసి కేసు.. లంచం డబ్బులు అంటూ ఫోన్‌లో మాట్లాడాడు. ఆ సంభాషణను బుధవారం సామాజికమాధ్యమాల్లో విడుదల చేశాడు.

అత్త, ఆడపడచులపై దాడి - కేసు నమోదు

ఎల్లారెడ్డిపేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఇల్లును తమ కూతురు పేరిట చేయాలని కోడలు అత్తపై ఒత్తిడి చేయడంతో పాటు గొడవకు దిగింది. దీంతో 60 ఏళ్ల వృద్ధురాలైన అత్త గురువారం ఎల్లారెడ్డిపేట పోలీసులను ఆశ్రయించింది. ఎస్ఐ రమాకాంత్ కథనం మేరకు.. ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌లోని జాగిరి రాజవ్వ తన భర్త గౌరయ్య చనిపోవడంతో ఒంటరిగా ఉంటోంది. కొంతకాలంగా కోడలు జాగిరి దేవేంద్ర అత్త పేరిట ఉన్న ఇల్లును తమ కూతురు పేరిట రిజిస్ట్రేషన్ చేయాలంటూ ఇబ్బందులకు గురిచేస్తోంది. దాంతో వృద్ధురాలు రాజవ్వ హైదరాబాద్‌లో ఉంటున్న తన కూతురు చింతల పద్మకు విషయం తెలిపింది. ఆమె బొప్పాపూర్‌కు చేరుకుని ఎందుకు గొడవ చేస్తున్నావని ప్రశ్నించింది. దాంతో కోడలు దేవేంద్ర, గుండారంలోని ఆమె అల్లుడు తిరుమల్‌లు వృద్ధురాలు రాజవ్వ, కూతురు పద్మను తిడుతూ కర్రతో దాడి చేశారు. ఘటనలో పద్మ తీవ్ర గాయాలపాలైంది. తమ కోడలు, ఆమె అల్లుడు తిరుమల్‌పై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని వృద్ధురాలు రాజవ్వ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. దేవేంద్ర, అల్లుడు తిరుమల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రమాకాంత్ తెలిపారు.

ప్రమాదకరంగా బీర్‌పూర్ ఘాట్ రోడ్డు

బీర్‌పూర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ ఘాట్ రోడ్డు ప్రమాదకరంగా మా రింది. బీర్‌పూర్ ఘాట్‌రోడ్డు గుండా జగిత్యాల జిల్లా నుంచి మంచిర్యాల, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలకు నిత్యం వాహనాల రాకపోకలు కొనసాగుతుంటాయి. కమ్మునూర్ బ్రిడ్జి నిర్మాణం తర్వాత రవాణా పెరిగింది. దీంతో ఘాట్‌రోడ్డుపై ఏర్పాటు చేసిన సీసీ రోడ్డుకు ఇరువైపులా గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



బీర్‌పూర్ ఘాటు రోడ్డుపై వేసిన సీసీ రోడ్డుకు ఇరువైపులా ఏర్పడిన గుంతలు

పెద్దపులి దాడిలో ఆవు మృతి

- కొండాపూర్ శివారులో సంచారం
- అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన

కొడిమ్యాల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం కొండాపూర్ గ్రామశివారులో గురువారం తెల్లవారుజామున పెద్దపులి దాడిలో ఆవు మృతిచెందింది. మొదట చిరుత దాడితో ఆవు మృతిచెందిదన్న సమాచారంతో కొడిమ్యాల డిప్యూటీ రేంజర్ ముషీర్ అహ్మద్ సిబ్బందితో కొండాపూర్‌లో సంఘటన జరిగిన స్థలాన్ని పరిశీలించారు. గుడిసెలో నాలుగు పశువులు ఉండగా తాడుతో కట్టేసిన ఒక ఆవు కొంతదూరం పరుగెత్తి గాయపడి మృతి చెందినట్లు అటవీ అధికారులు గుర్తించారు. ఉదయం సంఘటన స్థలంలో చుట్టుపక్కల ప్రాంతంలో చిరుత అడుగులు కానీ, ఎలాంటి ఆనవాళ్లులేవని అటవీ అధికారులు తెలిపారు. చిరుత దాడితోనే ఆవు మృతి చెందిందని అటవీ అధికారులు భావించారు. సంఘటన స్థలానికి సమీపంలో అధికారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. గురువారం రాత్రి సీసీ పుటేజీని పరిశీలించిన అధికారులు ఆ ప్రాంతంలో పులి సంచరించినట్లు నిర్ధారించారు. పులి తల భాగం కనిపించేలా ఒక పుటేజీ కెమెరాలో రికార్డు అయ్యింది. జగిత్యాల జిల్లాలో పెద్దపులి కదలికలను గుర్తించడంతో ఈ ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కొండాపూర్, బొల్లోనిచెరువు, రామకిష్టాపూర్, దమ్మయ్యపేట, కొడిమ్యాల, వేములవాడ మండలం ఫాజుల్‌నగర్ గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాత్రిపూట బయటకు వెళ్లవద్దని డీఎఫ్ఆర్వో ముషీర్ అహ్మద్ తెలిపారు. డీఎఫ్ ఆర్వో వెంట రేంజర్ మోయినోద్దిన్, బీట్ అధికారులు ఆనందరావు, అశ్విని, బేస్ క్యాంప్ వాచర్లు బాలరాజు, మహేందర్ ఉన్నారు.

ఏసీబీకి చిక్కిన ఎస్టీవో, అటెండర్

- రిటైర్డ్ ఉపాధ్యాయుడి నుంచి రూ.10వేలు లంచం
- రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు

అంతర్గాం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఉపాధ్యాయుడికి రావాల్సిన బెనిఫిట్స్ పెన్షన్ మంజూరుకు ఎస్టీవో కార్యాలయంలో లంచం డిమాండ్ చేశారు. పలుమార్లు కార్యాలయం చుట్టూ తిరిగినా సమస్య పరిష్కారం కాకపోవడంతో ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వివరాలు ఇలా ఉన్నాయి. రామగుండం పట్టణంలోని ఉప కోశాధికారి కార్యాలయంలో సబ్ ట్రెజరి ఆఫీసర్ ఎక్కల మహేశ్వర్, అటెండర్ రెడ్డవేని పవన్ లంచం తీసుకుంటూ గురువారం ఏసీబీ అధికారులకు పట్టుబడినట్లు ఏసీబీ డీఎస్పీ వీవీ రమణమూర్తి తెలిపారు. రామగుండం పట్టణానికి చెందిన కన్నూరి ఆనందరావు అనే ఉపాధ్యాయుడు కొన్నినెలల క్రితం పదవీవిరమణ పొందాడు. సదరు రిటైర్డ్ ఉపాధ్యాయుడు తనకు రావాల్సిన బెనిఫిట్స్‌తోపాటు పెన్షన్ మంజూరుకు ఎస్టీవో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు. పెన్షన్ మంజూరు చేయాలంటే రూ.10వేలు ఇవ్వాలని ఎస్టీవో, అటెండర్ డిమాండ్ చేశారు. దీంతో కార్యాలయం చుట్టూ తిరిగిన రిటైర్డ్ ఉద్యోగి విసిగిపోయి ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఈక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు రూ.10వేలు లంచం ఇస్తుండగా వల పన్నిన ఏసీబీ అధికారులు ఎస్టీవో, అటెండర్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. లంచం తీసుకుంటూ పట్టుబడిన ఎస్టీవో అటెండర్‌ను కోర్టులో హాజరు పరుచనున్నట్లు ఏసీబీ డీఎస్పీ తెలిపారు. ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు కృష్ణకుమార్, పొన్నం చందర్, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ఉమ్మడి జిల్లా పాలిటెక్నిక్ కళాశాలల క్రీడా పోటీలు

- హాజరుకానున్న 600 మంది క్రీడాకారులు



క్రీడా పోటీలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయి పాలిటెక్నిక్ కళాశాలల క్రీడా పోటీలను శుక్ర, శనివారాల్లో రెండు రోజులపాటు జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రభుత్వ రెసిడెన్షియల్ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాల నుంచి 600 మంది క్రీడాకారులు పాల్గొనున్నారు. క్రీడాకారులకు ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్, తదితర క్రీడాంశాల్లో పోటీలను నిర్వహించనున్నారు. పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు పోటీలు దోహదపడుతాయని, క్రీడల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిటైర్డ్ ప్రిన్సిపాల్, సాంకేతిక విద్యాశాఖ ప్రతినిధి డాక్టర్ బి రాజగోపాల్, కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ జి అప్పారావు హాజరవుతారని ప్రిన్సిపాల్ డి శోభారాణి తెలిపారు. పోటీలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు, అధికారులకు అందరికీ ఉచిత భోజన, వసతి సౌకర్యాలను రెండు రోజులపాటు కల్పిస్తున్నామని ఆమె తెలిపారు.

బైక్ చెట్టుకు ఢీకొని ఇద్దరు యువకుల మృతి

- స్నేహితుడి జన్మదిన వేడుకలకు వెళ్లి వస్తుండగా ఘటన



రాజ్‌కుమార్(ఫైల్), అభిషేక్(ఫైల్)

కరీంనగర్ అర్బన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం మల్కాపూర్ శివారులోని బైపాస్‌రోడ్‌లో గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డుప్రమాదంలో కరీంనగర్ వావిలాలపల్లికి చెందిన బండారి రాజ్‌కుమార్(19), కొత్తపల్లికి చెందిన దండి అభిషేక్(19)లు అక్కడికక్కడే మరణించారు. బండారి రాజు, అతని స్నేహితుడు అభిషేక్ కలిసి బుధవారం రాత్రి 9 గంటలకు బైక్‌పై చింతకుంట ప్రాంతంలో స్నేహితుడి పుట్టిన రోజు వేడుకలకు వెళ్లారు. వేడుకల అనంతరం వేకువజామున తిరిగి చింతకుంట నుంచి కొత్తపల్లికి వెళ్తుండగా మల్కాపూర్ శివారులో బైపాస్‌రోడ్‌లో బైక్ అదుపుతప్పి రోడ్డు పక్క చెట్టును ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న బండారి రాజ్‌కుమార్, అభిషేక్‌లు ఎగిరి కిందపడగా తీవ్రగాయాలై అక్కడికక్కడే మరణించారు. గురువారం ఉదయం కొందరు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ప్రమాదంలో మరణించిన బండారి రాజు కరీంనగర్‌లోని ఒక కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతుండగా ఆయన తండ్రి ట్రాన్స్‌కో స్టోర్‌లో తాత్కాలిక ఉద్యోగం చేస్తున్నాడు. దండి అభిషేక్ ఇటీవల ఇంటర్ పూర్తి చేశాడు. ఆయన తండ్రి కూలీగా పనిచేస్తున్నాడు. తల్లిదండ్రులకు అభిషేక్ ఒక్కడే కొడుకు. స్నేహితుల మరణంతో రెండు కుటుంబాల్లో విషాదం నిండింది. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కొత్తపల్లి ఎస్ఐ సాంబమూర్తి తెలిపారు.

కల్వర్టును ఢీకొన్న కారు.. నలుగురికి తీవ్రగాయాలు

మానకొండూర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోచంపల్లి సమీపంలో గురువారం రాత్రి కల్వర్టును కారు ఢీకొన్న ప్రమాదంలో నలుగురికి తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఊటూర్‌కు చెందిన రవీందర్ కుటుంబంతో కలిసి కారులో హైదరాబాద్‌కు వెళ్లి ఊటూర్‌కు తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో మండలంలోని పోచంపల్లి గ్రామ సమీపంలో గల కల్వర్టుకు కారు ఢీకొట్టింది. కారులో ఐదుగురు ఉండగా రాజమణి, రవీందర్‌తో పాటు ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

కొత్త టీచర్లకు తప్పని వేతన వెతలు



జగిత్యాల జిల్లాలో 292 నూతన ఉపాధ్యాయులు

మూడు నెలలకు ఒక్క నెల మాత్రమే వేతనం అందజేత

అక్టోబరు, నవంబరు వేతనాల కోసం ఎదురుచూపులు

జగిత్యాల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఆశలతో ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగం సాధించిన కొత్త ఉపాధ్యాయులకు వేతన వెతలు తప్పడం లేదు. విద్యార్థులకు బోధన చేస్తున్న నూతన ఉపాధ్యాయులకు రెండు నెలలకు సంబంధించిన వేతనాలు అందడం లేదు. జగిత్యాల జిల్లాలో 292 మంది ఉపాధ్యాయులు ఉద్యోగంలో చేరి మూడున్నర నెలలు గడుస్తున్నా డిసెంబరు నెల వేతనం మాత్రమే చెల్లించారు. అక్టోబరు 10వ తేదీ నుంచి నవంబర్ మాసాంతం వరకు రావాల్సిన జీతాలు చెల్లించలేదు. టీచర్ల నియామక తేదీపై స్పష్టత కొరవడడం, ఎంప్లాయీస్ ఐడీ, ప్రాన్ అకౌంట్లు క్రియేట్ చేయడం, ట్రెజరీలో పలు సాంకేతిక సమస్యలు తదితర కారణాల వల్ల వేతనాలు అందించడంలో జాప్యం వల్లనే వేతనాలు అందలేదని సంబంధిత వర్గాలు అంటున్నాయి.

వేతనాలు చెల్లించాలి

తులసి ఆగమయ్య, టీఎస్ యూటీఎఫ్ జిల్లా నాయకులు, జగిత్యాల



జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో నూతనంగా నియామకమైన ఉపాధ్యాయులకు జీతాలు అందించాలి. అక్టోబరు 10నుంచి నియామకం అమలులోకి వచ్చింది. జిల్లా విద్యాశాఖ అధికారులు, ట్రెజరీ అధికారులు వివిధ కారణాలు చెప్పి జాప్యం చేస్తున్నారు. మూడు నెలలకు ఒక్క నెల మాత్రమే జీతాలు అందించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వేతనాలు మంజూరు చేయాలి.

డీఎస్సీ 2024లో ఎంపిక..

జగిత్యాల జిల్లాలో డీఎస్సీ 2024లో ఎంపికైన 292 మంది ఉపాధ్యాయులను అక్టోబరు 10వ తేదీన అపాయింట్ ఆర్డర్లు ఇచ్చారు. ఇందులో స్కూల్ అసిస్టెంట్లు 101 మంది, ఎస్‌జీటీలు 153 మంది, పీఈటీలు ఏడుగురు, లాంగ్వేజ్ పండిత్‌లు 31 మంది ఉన్నారు. ఆ తర్వాత సుమారు వారం రోజులకు జిల్లాలో కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్‌లు ఇచ్చారు. దీంతో కొంత మంది ఉపాధ్యాయులు అక్టోబరు 15వ తేదీ నుంచి మరికొంత మంది అక్టోబరు 17వ తేదీ నుంచి పాఠశాలల్లో చేరి విధులు నిర్వహిస్తున్నారు.

ఒక తేదీతో రిక్రూట్‌మెంట్ అయి, మరో తేదీన పోస్టింగ్ చేతికందడంతో వేతనాల చెల్లింపులో సాంకేతిక సమస్యలు వచ్చాయని అంటున్నారు. కొత్త టీచర్లకు అక్టోబరు 10వ తేదీ నుంచి వేతనాలు అందజేస్తామని రాష్ట్ర విద్యాశాఖ ప్రకటించింది. కానీ పనిచేయని రోజులకు వేతనాలు ఎలా ఇవ్వాలని, ఆర్థిక శాఖ నుంచి స్పష్టత రావాల్సి ఉందని ట్రెజరీ అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నట్లు ఉపాధ్యాయులు అంటున్నారు. తాము మూడు నెలలు పనిచేస్తే డిసెంబరు ఒక్క నెలకు మాత్రమే జీతాలు రావడంతో చాలీచాలనీ డబ్బులతో కుటుంబాలను ఎలా పోషించుకోవాలని నూతన ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా ప్రభుత్వం స్పందించి త్వరగా చెల్లించాలని కోరుతున్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి యువకుడి మృతి

పెద్దపల్లి రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుర్కలమద్దికుంట గ్రామానికి చెందిన ఈదునూరి లక్ష్మణ్ (31) ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. బుధవారం ఉదయం ఇంట్లోని వారు పనులకు వెళ్లగా లక్ష్మణ్ ఒక్కడే ఇంటి వద్ద ఉన్నాడు. పనికి వెళ్లి ఇంటికి వచ్చి చూసేసరికి లేకపోవడంతో పలు చోట్ల వెతికారు. రాత్రి సమయంలో ఇంటి ఎదుట గల చేదబావిలో శవమై తేలినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడి తల్లి ఈదునూరి సుశీల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఎస్ఐ లక్ష్మణ్‌రావు తెలిపారు.

ఎస్సారెస్పీ కాల్వలో పడి లారీ డ్రైవర్ మృతి

మానకొండూర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ఎస్సారెస్పీ కాల్వలో జారిపడి ఓ లారీ డ్రైవర్ మృతి చెందాడు. ఆంధ్రప్రదేశ్‌లోని క్రిష్ణ జిల్లా నందిగామ మండలంలోని లనాసాగరం గ్రామానికి చెందిన మల్లెంపూడి శంకర్ (37) అనే లారీ డ్రైవర్ మహారాష్ట్రకు వెళ్లి బుధవారం ఆంధ్రప్రదేశ్‌కు బయలుదేరాడు. మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామ శివారులోని ఎస్సారెస్పీ కాల్వలో స్నానానికి దిగాడు. నీటి ప్రవాహం అధికం కావడంతో నీటిలో కొట్టుకొని వెల్లాడు. సంబందిత అధికారులు నీటిని తగ్గించడంతో తిమ్మాపూర్ మండలంలోని పోలంపల్లి వద్ద గురువారం మృతదేహం లభ్యమైంది. మృతుడి సోదరుడు సాంబ షిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

నరసింహుని సన్నిధిలో డిప్యూటీ జనరల్ మేనేజర్ పూజలు



అజిత్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న వేదపండితులు

ధర్మపురి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహ స్వామి దేవాలయాన్ని నేషనల్ స్టాటిస్టిక్స్ ఆఫీస్ హైదరాబాద్ డిప్యూటీ జనరల్ మేనేజర్ అజిత్‌కుమార్ గురువారం సందర్శించారు. ఆలయం వద్ద ఆయనకు వేదపండితులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితరులు ఆశీర్వదించారు. ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్ ఆయనకు స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో వేదపండితుడు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

నవీన్‌కుమార్‌కు కేంద్రమంత్రి పరామర్శ



దేవిశెట్టి నవీన్‌కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కేంద్ర మంత్రి బండిసంజయ్‌కుమార్

భగత్‌నగర్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): సీనియర్ బీజేపీ నాయకుడు దేవిశెట్టి నవీన్‌కుమార్ కుటుంబ సభ్యులను కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ గురువారం పరామర్శించారు. నవీన్‌కుమార్ తల్లి దేవిశెట్టి రాజమణి (75) ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఈ సందర్భంగా నగరంలోని గణేష్‌నగర్‌లో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐఅండ్‌పీఆర్ జాయింట్ డైరెక్టర్ దేవిశెట్టి శ్రీనివాస్, ఆంజనేయులు, హన్మాండ్లు, జయంత్‌కుమార్, దేవిశెట్టి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జేఈఈ మెయిన్స్ పరీక్షలు

- రెండోరోజు 1863 మంది విద్యార్థులు హాజరు




విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

తిమ్మాపూర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ తొలివిడత ఆన్‌లైన్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. గురువారం రెండోరోజు పరీక్షకు కరీంనగర్ జిల్లాలోని తిమ్మాపూర్ మండలంలోని ఐయాన్ డిజిటల్ జోన్, శ్రీచైతన్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, జ్యోతిష్మతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్సెస్, కరీంనగర్‌లోని వాణినికేతన్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల కేంద్రాలను ఏర్పాటు చేశారు. నాలుగు పరీక్షా కేంద్రాల్లో కలిపి ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన మొదటి సెషన్‌లో 986 మంది అభ్యర్థులకు 963 మంది హాజరు కాగా 23 మంది గైర్హాజరు అయ్యారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఆరు గంటల వరకు జరిగిన రెండో సెషన్‌లో 919 మందికి 900 మంది హాజరు కాగా 19 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కాలేదు. మొత్తంగా రెండు సెషన్లలో కలిపి 1,905 మంది విద్యార్థులకు గాను 1,863 మంది విద్యార్థులు హాజరుకాగా 42 మంది పరీక్షకు హాజరు కాలేదని ఎన్‌టీఏ సిటీ కోఆర్డినేటర్ టి లలితకుమారి తెలిపారు.

చెట్టును ఢీకొన్న కారు: ఇద్దరికి గాయాలు

పెద్దపల్లి రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగాపూర్ గ్రామ శివారులో రాజీవ్ రహదారికి ఆనుకొని ఉన్న చెట్టును మంథని వైపు వెళ్తున్న కారు గురువారం వేకువజామున ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. క్షతగాత్రుల్ని పెద్దపల్లి ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. సంఘటన పై బసంత్‌నగర్ ఎస్‌ఐ స్వామిని అడగగా గోదావరిఖనికి చెందిన ఇద్దరు అన్నదమ్ములకు గాయాలైనట్లు తెలిపా రు. సంఘటనపై ఎలాంటి ఫిర్యాదులు రాలేదని పేర్కొన్నారు.



చుక్..చుక్.. రైలు బండి

- దాతల సహకారంతో పాఠశాలకు రంగులు
- ఉత్సాహంగా పాఠశాలకు వస్తున్న విద్యార్థులు

ఇల్లంతకుంట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలలో విద్యార్థులు "చుక్‌చుక్ రైలు వస్తుంది.. పక్క పక్కకు జరగండి" అంటూ ఆడుకుంటారు.. అదే రైలు బండి లాంటి పాఠశాల ఉంటే ఆ విద్యార్థుల ఆనందం పట్టరానిది... ప్రభుత్వ పాఠశాలలు అంటే శిథిలావస్థలో ఉండే తరగతి గదులు, వెలిసిపోయిన రంగులతో గతంలో కనిపించేవి... దీనితో పిల్లలు బడికి వెళ్లాలంటే మారాం చేసేవారు. కానీ పరిస్థితుల్లో మార్పువచ్చింది. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మారాయి.

మండలంలోని కందికట్కూర్ గ్రామంలోని ఎస్సీ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను అందంగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులు భావించారు. విషయాన్ని గ్రామపెద్దలకు చెప్పడంతో వారు ముందుకు వచ్చారు. రూ.1.50 లక్షలతో పాఠశాలకు రంగులు వేయాలని నిర్ణయించారు. మిగతా పాఠశాలలకు ఆదర్శంగా ఉండాలని భావించి చిత్రకారులను సంప్రదించి బాధ్యతలు అప్పగించారు. చిత్రకారులు పాఠశాలను పరిశీలించి రైలు బండిలా తయారు చేస్తామని పనులు ప్రారంభించి కొద్దిరోజులలోనే పూర్తిచేశారు. పాఠశాల గోడలపై అందమైన చిత్రాలు వేశారు. పాఠశాలను చూసిన విద్యార్థులు ప్రతిరోజు ఉత్సాహంగా పాఠశాలకు విద్యను అభ్యసిస్తున్నారు.

బడికి ప్రతీరోజు పోవాలనిపిస్తుంది..

పెద్దూరి హిమబిందు, విద్యార్థి, కందికట్కూర్



గతంలో పాఠశాల రంగులు వెలిసిపోయి ఉండేవి. ఇప్పుడు పాఠశాల రైలుబండిలా కనిపిస్తుండటంతో ప్రతి రోజు పాఠశాలకు వెళ్లాలనిపిస్తుంది. పాఠశాల గోడలపై అందమైన చిత్రాలు వేశారు. ప్రైవేట్ పాఠశాలలో చదివే నా స్నేహితులు కూడా వచ్చే సంవత్సరం ఇదే పాఠశాలకు వస్తామని అంటున్నారు. చక్కని విద్యతో పాటు ఆటలను ఉపాధ్యాయులు ఆడిపిస్తున్నారు.

దాతల సహకారంతో పాఠశాలకు మెరుగులు

బద్దం రవీందర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు కందికట్కూర్



గ్రామంలోని ఎస్సీకాలనీ పాఠశాలకు మెరుగులు దిద్దాలని గ్రామస్థుల సహకారం కోరాం. దీంతో తిరుపతి, అమర్, వేణురావు, వెంకటేశ్వర్‌రావు, చిరంజీవి అనే దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందించారు. పాఠశాలలో డ్రాపౌట్స్ తగ్గాయి. వచ్చే విద్యాసంవత్సరంలో పాఠశాలలో చేరే వారి సంఖ్య పెరిగే అవకాశం ఉంది. మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ త్వరలోనే పాఠశాలకు సందర్శిస్తానని చెప్పడం సంతోషకరం.

రచయితలు సమాజాన్ని మేల్కొల్పాలి

- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

కరీంనగర్ కల్చరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): సమాజంలో విలువలు తగ్గిపోతున్న క్రమంలో రచయితలు తమ రచనల ద్వారా సమాజాన్ని మేల్కొల్పాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ సూచించారు. కరీంనగర్ ఎస్ఆర్ఆర్ కళాశాలలో గురువారం కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో డాక్టర్ గంప్ర లక్ష్మణరావు రాసిన 'రామాయణ కల్పవృక్షం-లోకానుశీలన', డాక్టర్ మండలోజు నరసింహస్వామి రచన 'డాక్టర్ వెల్చాల కొండలరావు జీవితం-వాఙ్మయ సేవ', డాక్టర్ కలువకుంట రామకృష్ణ తెలుగు కవిత్వాన్ని అనువదించిన డాక్టర్ పాలకుర్తి దినకర్ ఇంగ్లీషు పుస్తకం 'ప్రొగ్రెస్ ఆఫ్ లైఫ్' పుస్తకాల ఆవిష్కరణ జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న బండి సంజయ్ మాట్లాడుతూ చెడును, అవాస్తవాలను ఖండించకపోవడం కూడా తప్పేనని అన్నారు. విదేశీ సంస్కృతి పేరుతో జాతీయ భావజాలంపై పెద్దఎత్తున దాడి జరుగుతోందని అన్నారు. ఎస్ఆర్ఆర్ అంటే తనకు గుర్తుకు వచ్చేవి కొట్లాటలు, విజయ ధ్రువీకరణ పత్రాలేనని అన్నారు. తాను కళాశాల పూర్వ విద్యార్థి కావడం సంతోషంగా ఉందని అన్నారు. ముగ్గురు ఉద్దండ పండితులు రచించిన పుస్తకాలను తన చేతుల మీదుగా ఆవిష్కరించడం, ఇంత మంది సాహితీవేత్తల సరసన కూర్చోవడం అదృష్టంగా భావిస్తున్నాని అన్నారు. వేదికపై సాహితీవేత్తలు ఒక్కొక్కరి సాహిత్య సేవలను, రచనల వివరాలను తనదైన శైలిలో వివరించారు. తెలుగు అకాడమీ పూర్వ సంచాలకుడు డాక్టర్ వెల్చాల కొండలరావు, తెలుగు విశ్వవిద్యాలయం మాజీ ఉపాధ్యక్షుడు ఆచార్య అనుమాండ్ల భూమయ్య, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, నవలా రచయిత అంపశయ్య నవీన్ కళాశాలతో తమకున్న పూర్వ అనుబంధాలను నెమరువేసుకున్నారు. కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కలువకుంట రామకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు గాజుల రవీందర్, టీజీసీజీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె సురేందర్‌రెడ్డి, ఎస్ఆర్ఆర్ స్టాఫ్ క్లబ్ సెక్రెటరీ డాక్టర్ ఎం శ్రీనివాసరెడ్డి, తెలుగు శాఖాధిపతి డాక్టర్ బూర్ల చంద్రశేఖర్, సిబ్బంది, విద్యార్థులు, కవులు, రచ యిత లు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్

● కళాశాల అభివృద్ధికి సహకరించండి

కేంద్రప్రభుత్వ నిధులను మరిన్ని మంజూరు చేసేలా సహకరించాలని ప్రిన్సిపల్ ఆచార్య రామకృష్ణ కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను కోరారు. కళాశాలలో అక్కడక్కడా కొన్నిగదులు శిథిలావస్థకు చేరుకున్నాయని తెలిపారు. సుమారు ఐదు వేల మంది విద్యార్థులు స్థానిక, సుదూర ప్రాంతాల నుంచి సైతం హాజరై వివిధ కోర్సులను అభ్యసిస్తున్నారన్నారు. ప్రస్తుతం 22 నుంచి 25 వరకు నూతన గదులు కావాల్సి ఉందని పేర్కొన్నారు. అలాగే బీసీ మెన్, ఉమెన్స్ హాస్టళ్లు అవసరమని తెలిపారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థుల ఎంపిక

తంగళ్లపల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఇంగ్లీష్ ఒలింపియాడ్, ఎలొక్యూషన్ పోటీలకు తంగళ్లపల్లి మండలం మండెపల్లి మోడల్ స్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ విఠల్ తెలిపారు. ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి ఇంగ్లీష్ ఒలంపియాడ్, ఎలొక్యూషన్ పోటీల్లో ఎలక్షన్ విభాగంలో కే మణితేజ, ఒలంపియాడ్ విభాగంలో ఎం విఘ్నేష్‌లు జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. గురువారం రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను ఎంఈఓ రాజు, ప్రిన్సిపల్ విఠల్, వైస్‌ప్రిన్సిపాల్ మురళి, ఉపాధ్యాయులు శైలజ, భానుతేజ అభినందించారు.

సఖి కేంద్రం నుంచి అత్తారింటికి చేరిన యువతి

ఎల్లారెడ్డిపేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రేమ వివాహం చేసుకు ని ఎటు తేల్చుకోలేక సంశయంలో ఉన్న యువతి సఖి కేంద్రం నుంచి భర్తతో కలిసి గురువారం అత్తారింటికి చేరింది. ఎల్లారెడ్డిపేట మండలం కిష్టు నాయక్ తండాకు చెందిన యువకుడు భానుప్రసాద్‌ను కామారెడ్డి జిల్లా భవాని తండాలోని యువతి పుష్ప ప్రేమించి పెళ్లి చేసుకుంది. ప్రేమించి పెళ్లి చేసుకున్న ఆమె మూడు ముళ్లు వేసిన భర్తతోపాటు తల్లిదండ్రుల నిర్ణయానికి కట్టుబడి ఉంటానని స్పష్టం చేయడంతో సదరు యువతిని పోలీసులు ఈనెల 22న సఖి కేంద్రానికి తరలించారు. పోలీసులు, సంబంధితశాఖ అధికారులు యువతి పుష్పకు సఖి కేంద్రంలో అవగాహన కల్పించారు. తాను పెళ్లి చేసుకున్న యువకుడితోనే కలిసి ఉంటానని చెప్పడంతో అధికారులు అతడికి అప్పగించారు. దీంతో యువతి పుష్ప అత్తింటి ఊరైన కిష్టు నాయక్ తండాకు చేరుకుంది.

దుబాయ్‌లో మల్యాల యువకుడి ఆత్మహత్య

మల్యాల: ఉపాధి కోసం దుబాయ్ వెళ్లిన బోగ గంగ సాయి(25) అనే యువకుడు అప్పుల బాధతో మంగళవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మల్యాలకు చెందిన బోగ గంగసాయి రెండు నెలల క్రితం దుబాయ్ వెళ్లాడు. అయితే అప్పులు వేధిస్తుండడంతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబసభ్యులకు సమాచారం అందింది. పనికి వెళ్లిన సాయి రూముకు తిరిగి రాకపోవడంతో తోటి మిత్రులు వాకబుచేయగా ఉరివేసుకొని మృతి చెందినట్లు గురువారం తెలిసింది. గంగసాయి తండ్రి చిన్నప్పుడే మృతిచెందగా రెండేళ్ల క్రితం అనారోగ్యంతో తల్లి చనిపోయింది. మృతదేహం స్వదేశానికి తీసుకురావడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

అదుపు తప్పి వ్యాన్ బోల్తా ఒకరికి గాయాలు

కొడిమ్యాల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారిపై ఉన్న మండలంలోని పూడూర్ గ్రామ శివారులో గురువారం సాయంత్రం జగిత్యాల వైపు నుంచి కరీంనగర్ వైపు మిర్చీతో వెళ్లుతున్న వ్యాన్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న తాటి చెట్టు, విద్యుత్ స్థంబాన్ని ఢీకొట్టింది. దీంతో వ్యాన్ నడుపుతున్న డ్రైవర్‌కు స్వల్ప గాయాలైనట్లు గ్రామస్థులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గాయాలపాలైన డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం 108 వాహనంలో జగిత్యాలలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ప్రస్తుతం డ్రైవర్ పరిస్థితి నిలకడగా ఉన్నట్టు వివరించారు.

అయోధ్య రాముడి వార్షికోత్సవ సంబరం



రాముని చిత్రపటాన్ని రంగవల్లులతో తీర్చిదిద్దిన మహిళలు

రంగవల్లులలతో రాముడి చిత్రాన్ని తీర్చిదిద్దిన మహిళలు

రామనామ స్మరణతో మార్మోగిన సాయిరాం నగర్‌కాలనీ

జగిత్యాల అగ్రికల్చర్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): అయోధ్యలో నిర్మించిన రామాలయంలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ జరిగి ఏడాది గడిచిన సందర్భంగా జిల్లా కేంద్రంలోని సాయిరాంనగర్‌లో గల జనతారాజ్ యూత్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని శ్రీరాముని చిత్రాన్ని అందమైన రంగవల్లులతో అందంగా తీర్చిదిద్ది, దీపాలంకరణ గావించారు. అనంతరం రామరసాన్ని కాలనీ వాసులకు ప్రసాదంగా వితరణ చేశారు. ప్రజలంతా ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో వర్ధిల్లాలని కోరుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వార్షికోత్సవ సంబరంతో కాలనీ సందడి వాతావరణం నెలకొనగా, రామనామ స్మరణతో వేడుక ప్రాంగణం మారుమ్రోగింది. ఈ కార్యక్రమంలో మాతలతో పాటు, యువతీ, యువకులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు సర్వాయి పాపన్న గుట్టల పర్యాటక కేంద్రం పనులకు శంకుస్థాపన

సైదాపూర్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్వాయిపేట గ్రామశివారులో గల సర్వాయి పాపన్న గుట్టలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడతలో రూ. 4.80కోట్ల నిధులు విడుదల చేసింది. ఆ నిధులతో చేపట్టే పనులకు శుక్రవారం రాష్ట్ర రవాణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ భూమి పూజ, శంకుస్థాపన చేయనున్నారు. సర్వాయి పాప న్న నివసించిన ప్రాంతాన్ని గుర్తించి మరిన్ని నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేయాలని సైదాపూర్ మండల ప్రజలు కోరుతున్నారు.



సింహగర్జన పేరుతో మంద కృష్ణపై విషం చిమ్మారు

- మహాకళా ప్రదర్శన నిర్వహణ కమిటీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి భరత్



మాట్లాడుతున్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి రామంచ భరత్

సిరిసిల్ల టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): సింహగర్జన పేరుతో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగపై మాల సంఘం నాయకులు విషం చిమ్మారని వెయ్యి గొంతులు-లక్ష డప్పుల మహాకళా ప్రదర్శన నిర్వహణ కమిటీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి రామంచ భరత్ అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో భరత్ మాట్లాడారు. గత సంవత్సరం ఆగస్టు 1న ఎస్సీ వర్గీకరణ ఏబీసీడీ రిజర్వేషన్లపై దేశ అత్యున్నత న్యాయస్థానం అనుకూలంగా తీర్పునిచ్చిందన్నారు. దేశంలోని ఆయ రాష్ట్రాలు జనాభా దామాషా ప్రకారం ఏబీసీడీ వర్గీకరణ అమలు చేసుకోవచ్చని న్యాయస్థానం తీర్పునిస్తే మాల సామాజిక వర్గంలోని కొందరు వ్యతిరేకిస్తూ హైదరాబాద్‌లో సింహగర్జన పేరుతో సభలు, సమావేశా లు పెట్టారని ఆరోపించారు. సభలో మంద కృష్ణమాదిగపై విషం చిమ్మారన్నారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో వేయి గొంతులు-లక్ష డప్పుల మహా కళాప్రదర్శన కార్యక్రమం మహాసభను నిర్వహించబోతున్నామన్నారు. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా, జగిత్యాల జిల్లాల సంయుక్త ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణం కే కన్వెన్షన్ హాల్ లో నిర్వహించనున్న సన్నాహక సదస్సుకు ముఖ్యఅతిథిగా మందకృష్ణమాదిగ హాజరు అవుతున్నారని తెలిపారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తాకు రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలోని అన్ని మండలాలు, గ్రామాల నుంచి మాదిగ బిడ్డలు డప్పులతో తరలిరావాలని పిలుపునిచ్చారు.

జిల్లాలోని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు, కార్యకర్తలు మాదిగ బిడ్డలు, మేధావులు, కళాకారులు, విద్యార్థు లు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి రుద్రారపు రామచంద్రం, కళామండలి జిల్లా అధ్యక్షుడు గజ్జల అశోక్, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆవునూరి ప్రభాకర్, గుండా థామస్, ఖానపురం లక్ష్మణ్, ఎలగందుల భిక్షపతి, సావనపెల్లి రాకేష్, దొబ్బల ఆనంద్ పాల్గొన్నారు.

కన్నకొడుకు పట్టించుకోవడం లేదు..

- పోలీసులను ఆశ్రయించిన వృద్ధుడు

ఎల్లారెడ్డిపేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కన్నకొడుకు తమ బాగోగులను పట్టించుకోకపోవడంతో పాటు ఆస్తి పంచివ్వాలని తన భార్యతో కలిసి దాడి చేశాడంటూ ఓ వృద్ధుడు గురువారం ఎల్లారెడ్డిపేట పోలీసులను ఆశ్రయించాడు. తన పేరిట ఉన్న భూమి ఇవ్వాలంటూ నిత్యం గొడవకు దిగుతూ కొడుతున్నాడని వాపోయాడు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన వృద్ధుడు నేవూరి వెంకటరెడ్డిని కొడుకు రమేశ్‌రెడ్డి, కోడలు లావణ్యలు పట్టించుకోక పోవడంతో భార్యతో కలిసి వేరుగా ఉంటున్నాడు. అయినా తండ్రి పేరిట ఉన్న భూమిని తమకు ఇవ్వాలని పేర్కొంటూ ప్రతి రోజు ఘర్షణకు దిగుతున్నాడు. కొడుకు, కోడలు అసభ్యపద జాలంతో దూషించడంతో పాటు కొడుతున్నారని, తమకు న్యాయం చేయాలని వృద్ధుడు వెంకటరెడ్డి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దాంతో కొడుకు రమేశ్ రెడ్డి, కోడలు లావణ్యలపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రమాకాంత్ వివరించారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య



గూళ్ల రవీందర్(ఫైల్)



శ్రీకాంత్(ఫైల్)

ఉమ్మడి జిల్లాలో వేర్వేరు కారణాలతో నలుగురు ఆత్మహత్య చేసుకున్నారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం సింగాపూర్ గ్రామంలో అప్పుల బాధ భరించలేక ఓ వ్యక్తి, పెద్దపల్లి జిల్లాలో కుటుంబకలహాలతో యువకుడు, రాజన్నసిరిసిల్ల జిల్లాలో ఆర్థిక ఇబ్బందులతో మరో యువకు డు ఆత్మహత్య చేసుకున్నాడు.

హుజూరాబాద్‌రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగాపూర్ గ్రామంలో గూళ్ళ రవీందర్ (55) అనే వ్యక్తి ఉరేసుకొని గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గూళ్ళ రవీందర్ దినసరి కూలీగా పనిచేస్తున్నాడు. సంవత్సరన్నర క్రితం అప్పు చేసి ఇల్లు కట్టాడు. సంవత్సరం క్రితం కాలు విరి గింది. దీంతో ఇంటి వద్దనే ఉంటున్నాడు. అప్పులు తీర్చే దారి కనిపించకపోవడం తో మనోవేదనకు గురయ్యాడు.

ఈనెల 22న ఇంట్లోని పక్కరూమ్‌లో పడుకున్నాడు. గురువారం తెల్లవారుజా మున రూమ్‌లోకి కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అప్పులు తీర్చే దారి లేక ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడు రవీందర్ కొడుకు గూళ్ల రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు.

కోల్‌సిటీ: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎల్కలపల్లి గేట్‌లో నివాసముండే చిట్టబోయిన నరేష్(35) అనే యువకుడు గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. నరేష్‌కు కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. నరేష్ భార్య శ్యామల ఇద్దరు పిల్లలతో పుట్టింట్లోనే ఉంటుంది. మద్యానికి బానిసైన నరేష్ భార్య కాపురానికి రావడం లేదనే మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నట్టు తల్లి శంకరమ్మ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఎన్‌టీపీసీ ఎస్‌ఐ ఉదయ్ కిరణ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గంభీరావుపేట: మండల కేంద్రానికి చెందిన వెన్ను శ్రీకాంత్ (26) అనే యువకుడు గురువారం అప్పుల బాధతో ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వృత్తిరీత్యా ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్న శ్రీకాంత్ ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు.

తన చెల్లెలు పెళ్లికి అప్పులు కావడం, తల్లి అనారోగ్య సమస్యలకు తోడు ఫొటోగ్రాఫర్ వృత్తి ఆశించి న విధంగా లేకపోవడంతో శ్రీకాం త్ మానసికంగా కుంగిపోయాడు. అప్పులు తీర్చే మార్గం లేక ఉరివేసుకున్నాడు. మృతుడి తండ్రి నర్సింగరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు.

న్యూస్ బాక్స్

అశోకచక్రం.. ఐక్యతకు చిహ్నం..

సిరిసిల్ల టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : జాతీయ జెండాలోని అశోకచక్రం భారతీయుల ఐక్యతను చాటుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి అన్నారు. గురువారం సిరిసిల్లపట్టణం 38వ వార్డు అశోక్‌నగర్‌లో పట్టణ సుందరీకరణలో భాగంగా ఏర్పాటు చేసిన అశోకచక్రం చిహ్నంను చైర్‌పర్సన్ కళాచక్రపాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడారు. మున్సిపల్ ఆధ్వర్యంలో అశోక్‌నగర్‌లో అశోకచక్రం చిహ్నంను ఏర్పాటు చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డి లావణ్య, కౌన్సిలర్ గూడూరి భాస్కర్, వార్డు నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం

ఇల్లంతకుంట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): బీసీల సమస్యల పరిష్కారానికి పోరాటం చేయాలని జాతీయ బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు దండు వినోద్ అన్నారు. మండలకేంద్రంలో గురువారం సమావేశం జరిగింది. మండలంలోని గ్రామాల అధ్యక్షులకు నియామక పత్రాలు అందించారు. మండల గౌరవ అధ్యక్షుడు తిప్పారపు శ్రావణ్, నాయకులు వంశీకృష్ణ, భూమల్ల ప్రశాంత్, బత్తిని స్వామి, తిప్పారపు వంశీ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఎల్లారెడ్డిపేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుమాల, బొప్పాపూర్, తిమ్మాపూర్, అగ్రహారం గ్రామాల్లో లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు గురువారం పంపిణీ చేశారు. నాయకులు శ్రీనివాస్‌గౌడ్, కిషన్, పద్మారెడ్డి, బాల్‌రెడ్డి, రవీందర్, శ్రీనివాస్, సుదర్శన్, రవి, మధు, సతీష్, రాజు, మాధవరెడ్డి, దేవరెడ్డి, రాజిరెడ్డి,ఆగం, యాదగిరి, సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ

రుద్రంగి జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : రుద్రంగి మండలం ఉమ్మడి మానాలలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ చెక్కులను గురువారం తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమ్ జలపతి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోపిడి రవీందర్, డిప్యూటీ తహసీల్దార్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

ముస్తాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా 4వ మహాసభలను జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు కుర్ర రాకేశ్ పేర్కొన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలోని తెలంగాణా తల్లి విగ్రహం వద్ద కరపత్రాల ఆవిష్కరణ చేశారు. ఫిబ్రవరి 5, 6 వతేదీలలో జరిగే భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్‌ఎఫ్‌ఐ నాల్గవ మహాసభలను విజయవంతం చేయాలన్నారు. విద్యార్థుల సమస్యలపై నిరంతరం ఉద్యమం చేస్తున్నది కేవలం ఎస్‌ఎఫ్‌ఐ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ మండల నాయకులు బండి ప్రణయ్, దయానంద, గణేశ్యామ్, దీక్షిత, కీర్తన, అనిల్, శ్రావణి, శైలజ, కీర్తిక తదితరులు పాల్గొనన్నారు.

మూడో రోజు.. దరఖాస్తులు, నిరసనలు



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ జిందం కళ



వంతడుపులలో అధికారులను ప్రశ్నిస్తున్న గ్రామస్థులు



తంగళ్లపల్లి మండలంలో గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

సిరిసిల్ల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల అర్హుల జాబితా వెల్లడి కోసం నిర్వహిస్తున్న గ్రామసభల్లో ఒకవైపు నిరసనలు, మరోవైపు దరఖాస్తులు స్వీకరణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. మూడవ రోజు గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో 62 గ్రామాల, సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల్లో 18 వార్డుల్లో గ్రామసభలు జరిగాయి. గ్రామసభల్లో యధావిధిగా అర్హుల జాబితాలు చదవడంతోనే తమ పేర్లు రాలేదంటూ నిరసనలు వ్యక్తం చేశారు. ఎల్లారెడ్డిపేట, గంబీరావుపేట, సిరిసిల్లలో సభల్లో ప్రజాపాలన సమయంలో తాము ఇచ్చిన దరఖాస్తులు వివరాలు ఏవీ అంటూ ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నా పేర్లు రాలేదంటూ నిరసనలు వ్యక్తం చేశారు. ఎల్లారెడ్డిపేటలో బీఆర్ఎస్ కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. పోలీసులు జోక్యంతో వివాదం సద్దుమణిగింది. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో పది వార్డుల్లో సభలు నిర్వహించారు. కార్యక్రమంలో సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళచక్రపాణి, కమిషనర్ లావణ్య, వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్లు అకుల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

● వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట) : వీర్నపల్లి మండలం రంగంపేట, శాంతినగర్ గ్రామాల్లో అధికారులు గురువారం ప్రజాపాలన గ్రామ సభలను నిర్వహించారు. పలువురు తమ పేర్లు జాబితాలో లేవని అధికారులను ప్రశ్నించారు. శాంతినగర్‌లో సుమారు 130 ఇళ్లు లావాణీ భూముల్లో నిర్మించుకున్నామని ఇంటి స్థలానికి 2 గుంటల చొప్పున అనుమతి పత్రాలను ఇప్పించాలని తండావాసులు వినతి పత్రం అందజేశారు. తహసీల్దార్ మారుతిరెడ్డి, ఎంపీడీవో వాజీద్, వివిధ శాఖల అధికారులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ప్రకటించిన జాబితాలలో అర్హులైన వారి పేర్లు కనిపించడం లేదని ప్రజలు అధికారులను నిలదీశారు. ప్రజాపాలన గ్రామసభలలో భాగంగా గురువారం వంతడుపుల, సిరికొండ, తిప్పాపూర్, వల్లంపట్ల, సోమారంపేట, నర్సక్కపేట, పొత్తూరు, కేసన్నపల్లె గ్రామాల్లో గురువారం సమావేశాలు జరిగాయి. జాబితాల్లో పేర్లులేని వారు అధికారులను నిలదీశారు. తహసీల్దార్ ఫారూఖ్, ఎంపీడీవో శశికళ, ప్రత్యేకాధికారులు సురేష్‌రెడ్డి, సత్యనారాయణ, రమేష్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

● తంగళ్లపల్లి : మండలంలోని సారంపెల్లి, ఇందిరమ్మకాలనీ, ఓబులాపూర్ బాలమాలు పల్లి దేశాయిపల్లి, గోపాలరావుపల్లె, చిన్నలింగాపూర్ గ్రామాల్లో గ్రామసభలు జరిగాయి. ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

● ముస్తాబాద్ : ముస్తాబాద్, పోతుగల్, బందనకల్, నామాపూర్ గ్రామపంచాయతీల్లో ప్రజాపాలన సభలను నిర్వహించారు. నామాపూర్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు మెర్గు అంజాగౌడ్ సభను బీజేపీ బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. తహసీల్దార్ సురేశ్, ఎంపీడీవో బీరయ్య, ఏఈఈ భరత్, ఏఈఈ దివ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, విండోచైర్మన్ అన్నం రాజేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు పాల్గొన్నారు.

● వేములవాడ రూరల్ : మండలంలోని నమలిగుండుపల్లి, హన్మాజిపేట, నాగాయపల్లి, మర్రిపల్లి గ్రామాల్లో గ్రామసభలను నిర్వహించారు. ఎంపీడీవో శ్రీనివాస్, మాజీ ఎంపీపీ రంగు వెంకటేశం, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

● కోనరావుపేట : మండలంలోని ఎనిమిది గ్రామాల్లో ప్రజా పాలన సభలను నిర్వహించారు. తహసీల్దార్ విజయప్రకాశరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, ఎంపీడీవో శంకర్ రెడ్డి, ఏవో సందీప్, అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

● చందుర్తి : మండలంలోని జోగాపూర్, మల్యాల, తిమ్మాపూర్, రామారావుపల్లి గ్రామాల్లో సభలను అధికారులు నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి రవిందర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, ఇన్చార్జి ఎంపీడీవో ప్రదీప్ కుమార్, మండల వ్యవసాయశాఖ అధికారి దుర్గరాజు, డీటీ శ్రీలత, ఆర్ఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట గ్రామసభలో అధికారుల నిలదీత

ఎల్లారెడ్డిపేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో గురువారం ప్రజాపాలన గ్రామ సభ నిలదీతలు, నిరసన మధ్య కొనసాగింది. ప్రజలకు మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు నిలిచారు.అక్కడే ఉన్న కాంగ్రెస్ నాయకులు అధికారులు జాబితాలోని పేర్లను వెల్లడిస్తే ఎందుకు అడ్డుకుంటున్నారని, ఇది సరైన పద్ధతి కాదంటూ స్పష్టం చేశారు. ప్రజలు, బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య తీవ్ర వాగ్వివాదం చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఐ రమాకాంత్ ఆధ్వర్యంలోని పోలీసులు చేరుకుని నిరసనకారులను శాంతింపజేసేందుకు యత్నించిన వినిపించుకోలేదు. గ్రామసభ ఉద్రిక్తతగా మారింది. మండల ప్రత్యేక అధికారి అఫ్జల్‌బేగం కల్పించుకుని ప్రతి పేదకు ప్రభుత్వ పథకం వర్తించేలా చర్యలు తీసుకుంటామని తేల్చి చెప్పారు. చివరికీ నిరసనలు, నిలదీతల మధ్య సభ ముగిసింది. కాగా, మండలంలోని అక్కపల్లి, దుమాల, పోతిరెడ్డిపల్లి, గుండారం, తిమ్మాపూర్ గ్రామాల్లో అధికారులు ప్రజాపాలన గ్రామ సభలను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారులు సత్తయ్య, రాజు, కృష్ణహరి, శ్రీనివాస్, ఏఎంసీ చైర్ పర్సన్ సబేరాబేగం, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, ఆయా శాఖల అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



అధికారులను నిలదీస్తున్న బీఆర్ఎస్ నాయకులు

స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి కోసమే గ్రామసభలు

- జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్దం వేణు

ఇల్లంతకుంట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థలలో ఎన్నికలలో లబ్ధిపొందడానికే కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలంటూ ప్రజలను మభ్యపెడుతుందని జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్దం వేణు పేర్కొన్నారు. మండంలోని పొత్తూరు గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గ్రామానికి ఎన్ని ఇళ్లు కేటాయిస్తారో చెప్పడం లేదని, కేవలం కొంతమంది జాబితాను చదువుతున్నారని అన్నారు. అర్హులైన నిరుపేదలను విస్మరించి దగ్గరి వారికి ఇప్పించుకునే ప్రయత్నం కాంగ్రెస్ నాయకులు చేస్తున్నారని ఆరోపించారు. గ్రామసభల పేరుతో కాలయాపన జరుగుతుందే తప్ప ప్రజలకు ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. లబ్ధి దారులు ప్రశ్నించకుండా పోలీసుల పహారా మధ్య గ్రామసభలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ సిద్దం శ్రీనివాస్, నాయకులు పట్నం శ్రీనివాస్, గుంటి మధు, బండారి మహేష్, పట్నం మహేందర్, ఆకుల రవి, పట్నం కరుణాకర్, గుంటి తిరుపతి, శ్రీధర్, తోడేటి సతీష్, పైడిపాల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ముంపు గ్రామాల ప్రజల ఉపాధికి పరిశ్రమల ఏర్పాటు..

- అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తాం - ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మధ్య మానేరు ముంపు నిర్వాసితులకు ఉపాధి కల్పించేందుకు పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మండలం రుద్రవరంలో నిర్వహించిన గ్రామసభకు గురువారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ అర్హులైన అందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. ప్రజాపాలన గ్రామసభల్లో చదివిన జాబితాల్లో పేర్లు లేని అర్హులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారులు ఆందోళన చెందాల్సిన పని లేదని హామీఇచ్చారు. గతంలో మాదిరిగా నాలుగు గోడల మధ్యం లబ్ధిదారుల ఎంపిక చేయడం లేదని, ప్రజల సమక్షంలో ఎంపిక జరుగుతుందన్నారు. ముంపు గ్రామాల ప్రజలకు ఉపాధి కల్పించేందుకు మంత్రి శ్రీధర్‌బాబుతో ఇప్పటికే చర్చించామని వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మహేష్‌కుమార్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య, సింగిల్‌విండో చైర్మన్ రేగులపాటి కృష్ణదేవరావు, కత్తి కనుకయ్య, గాలిపెల్లి స్వామి, ఊరడి రాంరెడ్డి వంకాయల భూమయ్య తదితరులు ఉన్నారు.



రుద్రవరం గ్రామ సభలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

బాలికలకు ఆదరణేదీ..?

(5వ పేజీ తరువాయి)

52 మందిని పట్టుకున్నారు. 44 కేసులు నమోదు చేశారు. 2022లో 346 కేసులు నమోదు కాగా, గత సంవత్స రం 282 కేసులు నమోదు చేశారు. జిల్లాలో వరకట్న వేధింపుల్లో 2023లో 250 కేసులు నమోదు కాగా, గత సంవత్సరం 214కేసులు నమోదయ్యాయి.

పుత్తడి బొమ్మకు పుస్తెల భారం..

ప్రజల్లో అవగాహన పెంచినా పుత్తడి బొమ్మలకు పుస్తెల భారం తప్పడంలేదు. చదువుకునే వయస్సులో బాలికలకు వివాహాలు చేస్తూ బాధ్యతల బరువును అప్పగిస్తున్నారు. బాల్యవివాహ నిరోధక చట్టం-2006 ఉన్నా గుట్టుచప్పుడు కాకుండా జిల్లాలో బాల్యవివాహాలు జరుగుతూనే ఉన్నాయి. జిల్లా స్త్రీశిశు సంక్షేమ శాఖ ద్వారా 2022 వరకు 50 బాల్య వివాహాలను అడ్డుకున్నారు. రోజురోజుకు బాల్య వివాహాలు పెరుగుతూనే ఉన్నాయి. 2017లో రెండు వివాహాలు, 2018లో ఏడు, 2019లో 11 వివాహాలు, 2020లో 11 వివాహాలు, 2021లో 7 వివాహాలు, 2022లో 12 వివాహాలు, 2023లో 13వివాహాలు, 2024లో 7 బాల్య వివాహాలను నిలిపివేసి అవగాహన కల్పించారు. మరోవైపు భ్రూణహత్యలు కూడా ఆగడం లేదు. బాలికల నిష్పత్తి తగ్గిపోతున్నా డయాగ్నోస్టిక్ కేంద్రాలపై నిఘా ఉన్నా లింగ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.

స్మైల్, ముస్కాన్ ద్వారా చిన్నారులకు చేయూత

ప్రతి సంవత్సరం జనవరిలో ఆపరేషన్ స్మైల్, జూలైలో ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలను నిర్వహిస్తూ బడి బయట ఉండి బాలకార్మికులుగా, భిక్షాటన చేస్తూ జీవనం గడుపుతున్న వారిని రెస్క్యూ చేస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 2017 నుంచి 2025 జనవరి వరకు 656 మందికి చేయూతను అందించగా జిల్లాలో బాల రక్షక్ వాహనాన్ని ఏర్పాటు చేసి నిత్యం సేవలు అందిస్తున్నారు.

పోలీసుల వినూత్న కార్యక్రమాలు..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో బాలికలు, మహిళ రక్షణ కోసం మొదటి ప్రాధాన్యం ఇస్తున్నారు. మహిళలు, బాలికలకు భద్రత కోసం పోలీసులు అభయ యాప్‌ను రూపొందించారు. అభయ షై ట్యాక్సీ సేఫ్ అనే యాప్‌ను అందుబాటులోకి తీసుకవచ్చి జిల్లాలో 4 వేల ఆటోలకు అనుసంధానం చేశారు. బస్సులో భరోసా కార్యక్రమంతో సీసీ కెమెరాలను అమర్చారు. మరోవైపు కళాశాలల్లో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాలను చేపట్టారు. ఆపరేషన్ జ్వాల కార్యక్రమాలను అందించారు. పోలీస్ అక్క కార్యక్రమాన్ని వినూత్నంగా రూపొందించారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక మహిళా పోలీస్ కానిస్టేబుల్‌ను ఎంపిక చేసి పాఠశాలలు, కళాశాలను తరచూ సందర్శిస్తూ మహిళా చట్టాలపై అవగాహన కల్పిస్తూ వారితో అనుసంధానం అయ్యేవిధంగా చర్యలు చేపట్టారు. అంతే కాకుండా స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు చట్టాలపై అవగాహన కల్పిస్తున్నారు.

బాలబాలికల నిష్పత్తిలో భారీ వ్యత్యాసం

రాజన్నసిరిసిల్ల జిల్లాలో 2011 జనాభా లెక్కల ప్రకారం 5,52,037 మంది ఉన్నారు. ఇందులో పురుషులు 2,74,109 మంది, మహిళలు 2,77,928 మంది ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పురుషులు 2,15,791 మంది, మహిళలు 2,19,354 మంది, పట్టణ ప్రాంతాల్లో పురుషులు 58,318 మంది, మహిళలు 58,574 మంది ఉన్నారు. ఇందులో మహిళలు 3,819 మంది ఎక్కువగా ఉన్నారు. బాలికల నిష్పత్తిలో మాత్రం తేడా ఉంది. 6 సంవత్సరాలలోపు పిల్లల జనాభా 48,751 మంది ఉండగా బాలురు 25,099 మంది, బాలికలు 23,652 మంది ఉన్నారు. ఇందులో 1,449 మంది బాలికలు తక్కువగా ఉన్నారు. నిష్పత్తిలో వెయ్యిమంది బాలురకు 942 మంది బాలికలు ఉన్నారు. పాఠశాలలో చదువుతున్న వారు 37,754 మంది ఉన్నారు.

వంద రోజులు పాటు అవగాహన కార్యక్రమాలు..

- లక్ష్మీరాజం, జిల్లా అధికారి స్త్రీ, శిశు సంక్షేమ శాఖ



కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఒక థీమ్‌ను ప్రకటించి బాలికలు, మహిళల్లో అవగాహన పెంపొందించే కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ సంవత్సరం ఎంపవరింగ్ గర్ల్స్ ఫర్ ఏ బ్రైట్ ఫ్యూచర్ థీమ్‌ను ఇచ్చారు. దీంతోపాటు వంద రోజుల పాటు బాలికలు, మహిళలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నాం. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్న బాలికలు, మహిళలను గుర్తించి ప్రోత్సహిస్తాం. విద్యా సంస్థలు, మహిళలు పనిచేసే ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు కొనసాగిస్తాం.

ప్రధానమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం

ఇల్లంతకుంట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులకు నిధులు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో గురువారం మండలకేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో ప్రధానమంత్రి, కేంద్రమంత్రులచిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.మండలశాఖ అధ్యక్షుడు భూమల్ల అనీల్‌కుమార్, బత్తిని సాయగౌడ్, మేకల మల్లేశం, మామిడి హరీష్, నాగసముద్రాల సంతోష్, గొజగాని శంకర్, యాద సంపత్, కమలాకర్‌రావు, కార్తీక్, సిరివేని అంజయ్య, రాజు, బాలయ్య, ప్రసాద్, తదితరులున్నారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన కేంద్ర బృందం

తంగళ్లపల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ టీం తనిఖీ చేసింది. గురువారం తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన బృందం నేషనల్ హెల్త్ మిషన్ రికార్డ్‌లను పరిశీలించింది. ఎన్‌హెచ్ఎం నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పీఆర్సీ బృందం డాక్టర్ ఫ్రాన్సిస్ హెవియర్, డాక్టర్ థాంగ్ తదితరులు ఉన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

వేములవాడ రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ భరోసా పథకాలను అమలు చేసినందుకు హన్మాజిపేటలో రూరల్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సంఘస్వామి, మండల ఉపాధ్యక్షుడు బండ శ్రీనివాస్, నాయకులు శ్యామలగోవర్ధన్‌రెడ్డి, తీగల ఎల్లయ్య, సోయినేని కరుణాకర్, చిలుక ప్రభాకర్,ఆదిల్ పాషా, మ్యాక స్రవంతి, ఎడవల్లి అనీల్, పొత్తూరి నరేష్, శారద, లక్ష్మీరాజం, కిరణ్, అనీల్, కార్తిక్, వేణు, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

మహాప్రదర్శనను విజయవంతం చేయాలి

వేములవాడ టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో నిర్వహించే వేల గొంతులు లక్ష డప్పుల మహాప్రదర్శనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు గుండా థామస్ పిలుపునిచ్చారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని కొనాయపల్లి వార్డు సభ్యులతో కలిసి గురువారం సమావేశం అయ్యారు. ఈనెల 24న జిల్లాలో నిర్వహించే సన్నాహక సదస్సుకు ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు.

ఘనంగా నారా లోకేష్ జన్మదిన వేడుకలు

సిరిసిల్ల టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలను గురువారం సిరిసిల్ల పట్టణం టీడీపీ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి ఆవునూరి దయాకర్‌రావు, పట్టణ అధ్యక్షుడు తీగల శేఖర్‌గౌడ్, నాయకులు నక్క రాజయ్య, గుజ్జె శివరాం, బింగి వెంకటేశం, జెట్టి కొమరయ్య, పంజా బాలరాజు, గుజ్జె అశోక్, అజ్మత్‌ఖాన్, శ్రీశైల పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీవోగా సంధ్య

ఇల్లంతకుంట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండల ఇన్‌చార్జ్ పంచాయతీ అధికారిగా సంధ్య నియమిస్తూ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు. మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్ సెలవులలో వెళ్ళగా, రహీం ఖాన్‌పేట గ్రామపంచాయతీ కార్యదర్శి సంధ్యకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

క్రీడల నిర్వహణకు ఆర్థిక సాయం

చందుర్తి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) మండలంలోని మల్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న క్రీడల నిర్వహణకు ఎన్నారై అనపర్తి రాజు రూ.10వేలు ప్రధానోపాధ్యాయులు శరత్ చంద్ర గురువారం అందజేశారు. రుద్రంగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఈసరి శ్రీనివాస్, నాయకులు ప్రసాద్, సతీష్, సుధాకర్, దివ్యసాగర్, మధు, సుమన్, మధు, గంగాధర్, నరేందర్, శంకర్, శ్రీనివాస్, రాజు, ఉపాధ్యాయ బృందం, సేవా సమితి సభ్యులు విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలు పూడ్చివేయించిన పోలీసులు

ఇల్లంతకుంట, జనవరి 23 (ఆంధ్ర జ్యోతి): రోడ్డుపై గుంతలు పడి తరచు వాహనదారులు ప్రమాదాల బారినపడుతుండటంతో పోలీసులు గుంతలు పూడ్చివేయించారు. ఇల్లంతకుంట నుంచి గొల్లప ల్లికు వెళ్లే రోడ్డుపై గుంతలుపడి ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డుభద్రతా వారోత్సవాల సందర్భంగా పోలీసులు గురువారం రోడ్డుకు ఇరువైపులా ముళ్ల చె ట్లను తొలగించి గుంతలు పూడ్చివేశారు. ఈ సందర్భంగా పత్రి అంజయ్య, ఎద్దు రామస్వామి, దాసరి ఎల్లయ్య, పున్ని శంకరయ్యలతోపాటు ఆటోడ్రైవర్లు ఎస్సై శ్రీకాం త్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

● చందుర్తి : జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల భాగంగా రోడ్డు ప్రమాదల నివారణకు ఎస్ఐ అంజయ్య ఆధ్వర్యంలో రోడ్డు పక్కన చెట్ల తొలగింపు, మట్టితో గుంతలను పూడ్చివేయడంతో పాటు రోడ్డుపై సూచికలను ఏర్పాటు చేశారు.

డీఎల్‌పీవో విచారణ

ముస్తాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మొర్రాయిపల్లె గ్రామపంచాయతీ కార్యాలయంలో డీఎల్‌పీవో నరేశ్ గురువారం విచారణ చేశారు. గ్రామస్థుడు మెంగని రాజు గతంలో పనిచేసిన కార్యదర్శి ఉష అవినీతికి పాల్పడిందంటూ కలెక్టరేట్‌లో చేసిన ఫిర్యాదు మేరకు విచారణ చేశారు. నివేదికను పైఅధికారులకు సమర్పిస్తానన్నారు.

ఘనంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి



సిరిసిల్లలో పూలమాల వేస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్



సిరిసిల్లలో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



ముస్తాబాద్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : భారత స్వాతంత్ర్య పోరాటంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ పోరాటం స్ఫూర్తిదాయకం అని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి అన్నారు. సిరిసిల్ల మున్సిపల్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక సుభాష్‌నగర్‌లో సుభాష్ చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. నేతాజీ విగ్రహానికి మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, కమిషనర్ లావణ్య, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెల్ముల స్వరూపతిరుపతిరెడ్డి, కౌన్సిలర్లు, వివిధ పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ కళాచక్రపాణి మాట్లాడారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, సెస్‌డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, వార్డు కౌన్సిలర్ దార్నం అరుణ, కోఆప్షన్ సభ్యుడ ఎండీ సలీం, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఎండీ ఖాజా, బీ వెంకటేశం, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, మాజీ కౌన్సిలర్ యెల్లె లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కామునివనిత, బీఆర్ఎస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన రవి, ఉపాధ్యక్షుడు ఎండీ సత్తార్, కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు వెంగల శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : మండల కేంద్రంతో పాటు గొల్లపల్లి, వెంకటాపూర్ గ్రామాల్లో వేడుకలను నిర్వహించారు. మండల కేంద్రంలో గిరిధర్‌రెడ్డి, నర్సింలు, సురేందర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, వెంకటేశ్, స్వామిగౌడ్, రమేశ్ పాల్గొన్నారు.

● సిరిసిల్ల రూరల్ : బీజేపీ సిరిసిల్ల పట్టణ కమిటీ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నేతాజీ జయంతి వేడుకలను పట్టణంలోని సుభాష్‌నగర్‌లోని నిర్వహించారు. బీజేపీ కరీంనగర్ పార్లమెంటరీ కో-కన్వీనర్ అడెపు రవీందర్, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు వంగ అనిల్‌కుమార్‌గౌడ్, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ పత్తిపాక సురేష్, బీజేపీ నాయకులు ఎర్రం విజయ్, మోర శ్రీహరి, కోడం అనంద్‌బాబు, తాటిపాముల సత్యం, మేర్గు శ్రీనివాస్, వేముల పోశెట్టి, ఇంజపురి మురళి, దూడం సురేష్, గుండెల్లి శ్రీనివాస్, వేముల సురేష్, నారాయణ, రమేష్ పాల్గొన్నారు.

● ముస్తాబాద్ : మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, మాజీ కోఆప్షన్ మెంబర్ షాదుల్‌పాష, తాళ్ల విజయ్‌రెడ్డి, రంజాని నరేశ్, ఏదునూరి భానుచందర్, ఉచ్చిడి బాల్‌రెడ్డి, అన్నం శ్రీధర్, రంజాని రమేశ్, దీటి నర్సింలు, సద్ది మధు, మహేందర్, మిరుదొడ్డి భాను, తదితరులు పాల్గొన్నారు.

● గంబీరావుపేట : మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో జయంతిని నిర్వహించారు. మా స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు మల్లుగారి నర్సాగౌడ్, ఎస్ఐ శ్రీకాంత్, నాయకులు దేవేందర్, బాబు, మీనయ్య, బండ రమేష్, బాలరాజు, రమేష్‌ఉన్నారు.

● కోనరావుపేట : మండల కేంద్రంతో పాటు మల్కపేట, సుద్దాల తదితర గ్రామాల్లో వేడుకలను నిర్వహించారు. నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు బాలాజీ, బీఆర్ఎస్ నాయకులు, సింగిల్‌విండో వైస్ చైర్మన్ కాశవేణి మహేష్, కచ్చకాయల మహేష్, కాంగ్రెస్ నాయకులు ఎర్రవెల్లి నాగరాజు, విజయ్, ప్రజాప్రతినిధులు కాశవేణి మహేష్, సతీష్, ప్రవీణ్, కర్నాల గణేష్, తదితరులు ఉన్నారు.

● చందుర్తి : మండలంలోని మర్రిగడ్డ, మల్యాల గ్రామాల్లో బీజేపీ నాయకులు, స్వామి వివేకనంద సేవా సమితి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. మల్యాల జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు సుభాష్, పొంచేట్టి రాకేష్, చింతకుంట గంగాధర్, బొంబోతుల ప్రశాంత్, రాంరెడ్డి వెంకటరెడ్డి, పుప్పాల మోహన్‌రెడ్డి, అయోధ్య, శంకరయ్య, సాగర్, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే (ఐజేయు) మీడియా డైరీ ఆవిష్కరణ

వేములవాడ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : టీయూడబ్ల్యూజే (ఐజేయు) ఆధ్వర్యంలో ముద్రించిన 2025 మీడియా డైరీని వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నిరంతరం అలుపెరుగని పోరాటాలను కొనసాగిస్తున్న దశాబ్దాల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఏకైక యూనియన్ తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు దండి సంతోష్ కుమార్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దాసరి దేవేందర్, రాష్ట్ర లీగల్ అడ్వైజరీ కమిటీ సభ్యులు రేగుల దేవేందర్, జిల్లా సంయుక్త కార్యదర్శి తుపుకారి శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యుడు శ్రీరాముల శ్రీధర్, జిల్లా ఆర్గనైజర్ గంప రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలను పాటించాలి

సిరిసిల్ల టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ సీసీ రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలి త్వరగా ప్రజలకు వినియోగంలోకి తీసుకురావాలని మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణం 19వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి భూమి పూజను చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడారు. సిరిసిల్ల పట్టణం 19వ వార్డులో చాలా సంవత్సరాల క్రితం నిర్మించిన సీసీ రోడ్డు శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని కొత్తగా సీసీ రోడ్డు నిర్మించిలని కౌన్సిలర్ అన్నారం శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారన్నారు. మున్సిపల్ అధికారులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు అంచనాలను చేయించి మున్సిపల్ సమావేశంలో పాలకవర్గం ఆమోదంతో జనరల్ ఫండ్ నుంచి రూ.6లక్షలతో నిర్మాణ పనులను ప్రారంభించినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ శ్రీవాణి, ఏఈ నరసింహస్వామి వార్డు ప్రజలు, పలువురు నాయకులు పాల్గొన్నారు.